

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త

## ఢిల్లీలో సీఎంకి స్వాగతం పలికిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త - వైద్యం** రెండు రోజుల ఢిల్లీ పర్యటన నిమిత్తం బుధవారం దేశ రాజధానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా విజయవంతంగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి తన పర్యటనలో భాగంగా గురువారం రాష్ట్రపతి భవన్, కల్చరల్ సెంటర్‌లో నిర్వహించనున్న నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి కూడా హాజరవుతారు.

## కలెక్టరేట్ ఏవోగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరణ



**నెల్లూరు-కలెక్టరేట్, జూన్ 10, ప్రభాతవార్త** బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. విడవలూరు తహసీల్దారుగా పనిచేస్తున్న ఆయన కలెక్టరేట్‌కు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయ నూతన పరిపాలన అధికారిగా నియమించినట్లు డిఆర్‌ఓ ఎన్ విజయ్ కుమార్ తెలిపారు.

## నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : మంత్రి నారాయణ

- నెల్లూరు కార్పోరేషన్‌లో పురపాలక కమిషనర్‌లతో అభివృద్ధిపై చర్చించిన మంత్రి సమీక్ష
- ప్రజాసమస్యల సత్వర పరిష్కారంపై దిశా నిర్దేశం చేసిన మంత్రి
- పాలన ప్రజారంజకంగా ఉండాలని మంత్రి సూచన



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 10 ప్రభాతవార్త** :రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 20వేల కోట్ల అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయలేకుండా అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన మంత్రి నారాయణ బుధవారం నెల్లూరు కార్పోరేషన్‌లోని కమాండ్ కంట్రోల్‌హాలులో కమిషనర్లతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో మంత్రి ఘాటుగా మాట్లాడారు. అలాగే అమృత్ పథకం కింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి రెండేళ్ళలో ఏర్పటు చేస్తామని హామీ ఇచ్చారు. గత పాలకులు రాష్ట్రాన్ని చెత్తమయం చేసి వెళ్లారని ఆరోపించారు. 153లక్షల టన్నుల చెత్తను మిగిల్చి వెళ్ళారని, చెత్త పన్ను వసూలు చేసి చెత్తపాలన చేశారని ఎద్దేవా చేశారు. చెత్తరహిత రాష్ట్రంగా ఏపీని తీర్చి దిద్దేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రాసెసింగ్ ప్లాంట్‌లు, వేస్టుటు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. టిడ్కో ఇళ్ళను జులై అఖరు కల్లా పూర్తిచేస్తామని అన్నారు. పార్కులు, స్కూల్స్‌ను సిఎస్ఆర్ ఫండ్స్‌తో ఆధునీకరిస్తున్నామని దేశంలోనే విశాఖలో ఎల్ఈడి లైట్లు మొదటగా ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నా క్యాంటిన్‌లలో నాణ్యతను వారానికి ఒక రోజు పరిశీలనతో పాటు పోస్టర్లపై నిషేదం ఫ్లెక్సీలను 48గంటల తరువాత తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మేయర్ సుజాత మాట్లాడుతూ దుమ్ములేని నగరంగా నెల్లూరును తీర్చిదిద్దేందుకు మంత్రి పలు సూచనలు ఇచ్చారని అవి పాటిస్తున్నామని కాలువల ఆధునీకరణ పనుల్లో వేగం పెంచుతున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ మాట్లాడుతూ గ్రీనరీ నుంచి పారిశుద్ధ్యం వరకు అన్ని అంశాలపై అధికారులకు మంత్రి సూచించారు. నిధులను సద్వినియోగం చేసి అభివృద్ధితో ముందుకు వెలుతున్నామని తెలిపారు. సమీక్షలో కమిషనర్ వై.నందన్, మున్సిపల్ కమిషనర్లు, సిటిప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్‌హెల్త్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఫలప్రదమైన చర్చలతో జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

- మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం
- నీటిని అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలి - మంత్రి ఆనం
- సాగునీటి ప్రధాన కాలువల రిపేర్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి - మంత్రి నారాయణ






**నెల్లూరు, జూన్ 10 ప్రభాతవార్త - కలెక్టరేట్** నెల్లూరు నూతన జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌ఛార్జ్, రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం ముగిసింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కీలక సమావేశంలో రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం ప్రజాప్రతినిధులతో భేటీ అనంతరం ప్రారంభమైన ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తీరు మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు, మంత్రులు సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌తో కలిసి పలు కీలక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిపామని మంత్రి ఫరూక్ తెలిపారు. రాబోయేది ఖరీఫ్ సీజన్ కావడంతో ఎక్కువగా వ్యవసాయం, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖలపైనే ప్రత్యేకంగా దృష్టి సారించామని, ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో పొగాకు పండిస్తున్నప్పటికీ వారికి పొగాకు బోర్డులో సభ్యత్వం మరియు తగిన గుర్తింపు లేకపోవడంపై ఒక తీర్మానాన్ని ఆమోదించామన్నారు. అలాగే జొన్న పంటకు ప్రభుత్వం 3,699 మద్దతు ధర ప్రకటిస్తే, మార్కెట్లో 2,700 నుండి 3,000 లోపే పలుకుతుండటంతో ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించామని, మొక్కజొన్న కొనుగోళ్లపై కూడా చర్చించామన్నారు. వీటితో పాటు ఎంఎస్ఎం రంగంలో ఉన్న భూవివాదాల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని, ప్రస్తుతం జలాశయాలలో 75 టిఎంసిల నీరు నిల్వ ఉండటం సంతృప్తికరంగా ఉందని చెప్తూ, హోం శాఖ, జాతీయ రహదారులు మరియు హౌసింగ్ వంటి ఇతర స్థానిక సమస్యలను కూడా ఈ సమావేశంలో సుదీర్ఘంగా సమీక్షించామని తెలియజేశారు.

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ** వాతావరణ మార్పుల నేపథ్యంలో సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలని, నీటిపారుదల శాఖలో ఏ మాత్రం వృథా కాకుండా ప్రతి చుక్కను రైతులకు అవసరమైన మేరకే విడుదల చేయాలని అధికారులను కోరినట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో దాదాపు 46 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తూ, 3,600 నుండి 4,000 మంది రైతులు, 3,800 బార్నీలతో ఇంత పెద్ద ఎత్తున సాగు జరుగుతున్నప్పటికీ, టొబాకో బోర్డులో నెల్లూరు జిల్లా రైతాంగానికి గానీ, పొగాకు పండించే ఆత్మకూరు, ఉదయగిరి, కావలి ప్రాంత ప్రజాప్రతినిధులకు గానీ కనీస ప్రాతినిధ్యం లేదనే విషయాన్ని ఇటీవల తానే స్వయంగా డీసీపల్లి టొబాకో బోర్డు వద్దకు వెళ్ళినప్పుడు గుర్తించానని, దీనిపై వ్యవసాయ శాఖ మంత్రితో, పొగాకు రైతాంగం తరఫున ఉన్న సహచర మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడగా, భవిష్యత్తు సమావేశాలకు మన జిల్లా ప్రతినిధులను తప్పకుండా ఆహ్వానిస్తామని హామీ ఇచ్చారని మీడియాకు వివరించారు. అలాగే, ఒంగోలు జాతి ఎద్దులను కాపాడుకోవడానికి గతంలో ప్రభుత్వం 2,500 ఎకరాల భూమిని కేటాయించి ఏర్పాటు చేసిన చింతలదేవి బ్రీడింగ్ సెంటర్‌కు, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కామధేను ప్రాజెక్టుకు గతంలో నీటి వసతి కల్పించకుండా వదిలేశారని, అయితే ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక బీరివి కెనాల్ రాళ్లపాడు ప్రాజెక్ట్ సమీపంలోనే ఒక సోర్స్ ఏర్పాటు చేసి, మర్రిగుంట చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చి పంపింగ్ ఏర్పాట్లు పూర్తి చేశామని, మిగిలిన 20 పనులను కూడా రాబోయే 23 మాసాల్లో పూర్తి చేసి నీటి వసతి కల్పిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలో భాగంగా జిల్లాలో మొట్టమొదటి ఎంఎస్ఎంఈ ప్రాజెక్టును ఆత్మకూరులో ప్రారంభించినప్పటికీ అక్కడ పరిశ్రమలకు నీటి కొరత ఉందని, సోమశిల నుండి పైప్‌లైన్ ద్వారా నీటిని తెచ్చేందుకు గానూ ప్రస్తుతం అర్బన్ ప్రాంతాలకు వచ్చే పైప్‌లైన్లను అప్‌గ్రేడ్ చేసి కొంత నీటిని ఎంఎస్ఎంఈకి ఇచ్చేలా పరిశీలించాలని పురపాలక శాఖ మంత్రి నారాయణని కోరగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇదే సమయంలో ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో అమృత్ పథకం కింద మంచి నీటి సరఫరా కోసం దాదాపు 34 కోట్ల రూపాయలు మంజూరై, టెండర్ ప్రక్రియ కూడా విజయవంతంగా పూర్తయినట్లు మంత్రి నారాయణ తెలపడం పట్ల ఆత్మకూరు నియోజకవర్గ ప్రజల తరఫున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెబుతూ, ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న సీనియర్ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మీడియా ముఖంగా వెల్లడించారు.

శ్రీ- **మంత్రి డా. పొంగురు నారాయణ మాట్లాడుతూ** మన జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు ఫరూక్ ఆధ్వర్యంలో, నేను, నా తోటి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ బీదా మస్తాన్ రావు, జిల్లా శాసనసభ్యులందరం పాల్గొన్న డీఆర్‌సీ సమావేశం చాలా సానుకూల వాతావరణంలో ముగిసిందని. శాసనసభ్యులు వారి వారి నియోజకవర్గాల సమస్యలను ఈ వేదికపై బల అభిప్రాయాలను వెలిబుచ్చారు. ముఖ్యంగా వ్యవసాయం, నీటిపారుదల రంగాలపైనే సుదీర్ఘంగా చర్చించామని మంత్రి నారాయణ తెలిపారు. త్వరలోనే వర్షాకాలం ప్రారంభం కాబోతున్నందున కండలేరు, సోమశిల జలాశయాల నీటి నిల్వలపై సమీక్షించి, సాగునీటి ప్రధాన కాలువల రిపేర్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించమన్నారు. అలాగే రైతులకు యూరియా పంపిణీకి సంబంధించి గతంలో యాప్ ద్వారా ఒక రైతుకు మొదట రెండు బస్తాల చొప్పున ఇస్తామని చెప్పినప్పటికీ, మీటింగ్‌లో సభ్యులందరూ మూడు బస్తాలు ఇవ్వాలని కోరగా, మేము ఈ మీటింగ్‌కు వచ్చేటప్పటికే ప్రభుత్వం ఆల్రెడీ దాన్ని 3 బస్తాలకు పెంచుతూ అంగీకరించిందనే శుభవార్తను ఇక్కడ తెలియజేశారు. ఇక మన జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో పొగాకు పండిస్తున్న రైతుల సమస్యలను నేరుగా పొగాకు బోర్డ్ దృష్టికి తీసుకెళ్లడానికి మన జిల్లా నుండి ఒక మెంబర్ ఉండాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చేసిన ప్రతిపాదనపై వెంటనే స్పందించి, కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ఇమిడియట్‌గా లెటర్ రాయమని ఆదేశిస్తూ ఇక్కడే ఒక కీలక తీర్మానం పాస్ చేశామని, రాబోయే రోజుల్లో మేమిద్దరం ఫాలోఅప్ చేసి మన జిల్లా వ్యక్తికి ఆ పదవి దక్కేలా చూస్తామన్నారు. ఇదే సందర్భంలో చింతలదీవి బ్రీడింగ్ సెంటర్‌లో మెయిన్‌గా ఉన్న నీటి సమస్యకు ఒక సొల్యూషన్ చెప్పడంతో పాటు, మన ఎంపీ బీదా మస్తాన్ రావు తన ఎంపీ ఫండ్స్ నుంచి కాకుండా, ఆయన సొంత కంపెనీ తరఫున 10 మిలియన్ల ప్రాన్ సీడ్ ఉచితంగా ఇస్తానని ప్రకటించడంపై ఆయనను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు వీటిని మన కాలువల్లో వదిలితే వేటాడి రొయ్యలు పట్టుకునే పేద సామాజిక వర్గాలకు ఎంతో బెనిఫిట్ అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి అడిగిన మున్సిపల్ పరిధిలోని అల్లిపురం రోడ్డు సమస్యపై ఇప్పుడే ఇమిడియట్‌గా ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చి, మరొక్క వారంలో దానికి సంబంధించిన టెండర్లు పిలవాలని ఆదేశించాం మని అలాగే జిల్లాలో కాలనీల ఏర్పాటుకు, స్కూళ్ల నిర్మాణానికి స్థలాలు ఇచ్చిన దాతలను గౌరవిస్తూ ఆయా ప్రాంతాలకు సదరు దాతల పేర్లనే పెట్టాలని రిజల్యూషన్ చేసి పంపాం అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో 175 ఎంఎస్ఎంఈ పార్కులు పెట్టాలనేది మన ప్రభుత్వ లక్ష్యం కాగా, ఇందులో ఫస్ట్ పార్కును ఆల్రెడీ ఆత్మకూరులోనే ఇనాగ్యురేట్ చేశాం, ఇక నెల్లూరు సిటీలో కడుతున్న ఫ్లాటెడ్ ఎంఎస్ఎంఈ పార్క్ సివిల్ పనులన్నీ పూర్తిగా పూర్తయ్యాయి కాబట్టి కేవలం పెండింగ్ ఉన్న ఎలక్ట్రిసిటీ పనులను కూడా మరో 10 రోజుల్లో కంప్లీట్ చేసి పార్కును ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తంగా ఈరోజు జరిగిన డీఆర్‌సీ మీటింగ్‌లో జిల్లా అభివృద్ధికి ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నాం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి





- పెండింగ్ పనులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- ప్రశాంతంగా నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం




**నెల్లూరు-కలెక్టరేట్, జూన్ 10, ప్రభాతవార్త** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, రహదారుల మరమ్మత్తులు, సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, సిఇవో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జడ్పీటీసీలు, ఎంపిపిలు, అధికారులు హాజరయ్యారు. తొలుత సమావేశంలో పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా విద్యాశాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సభలో చర్చించారు. ప్రధానంగా పలు ప్రధాన రహదారుల మరమ్మత్తులు, నూతన రోడ్ల మంజూరుపై సభ్యులు ప్రశ్నించారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఎక్కువగా సచివాలయాల బిల్డింగులు అసంపూర్తిగా ఉన్నాయని, బిల్లులు కూడా పెండింగ్ లో ఉన్నాయని, నాడు నేడు కింద పాఠశాలలో చేపట్టిన పనులు కూడా మధ్యలో నిలిచిపోయి ఉన్నాయని పలువురు సభ్యులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. తమకు మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉందని, ఈ సమయంలోగా తాము ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు జడ్పిటిసిలు కోరారు. నూతనంగా మంజూరైన ఆరోగ్యకేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు.

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ** జిల్లా పరిషత్ సమావేశం సజావుగా జరిగిందని తెలిపారు. మరో మూడు నెల్లో జిల్లా ప్రజా పరిషత్ పాలక మండలి పదవీ కాలం ముగుస్తుందని, బహుశా మరొక సమావేశం జరిగే అవకాశం ఉందని, మొట్టమొదటి జిల్లా పరిషత్ సమావేశంలో తాను పాల్గొన్నానని, చివరి సమావేశంలో కూడా తాను పాల్గొని జిల్లా సమగ్ర అభివృద్ధికి జిల్లా పరిషత్ చేసిన సేవలను గుర్తు చేసుకోవడంలో పాలు పంచుకోవడం జరుగుతుంద ని చెప్పారు. జిల్లా పరిషత్ సాధారణ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువ చ్చారని, కొన్ని సమస్యలపై డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్క రించేందుకుచర్యలుతీసుకుంటామని స్పష్టం చేశారు.

**రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ** జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రధానంగా రహదారుల మరమ్మత్తులపై సభ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సచివాలయాలను పూర్తిస్థా యిలో నిర్మించడం, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, పాఠశాలలు మొదలైన అంశాలపై కూడా చర్చించా మని, వీటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

**కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ** ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తుందన్నారు. కోవూరు నియోజకవర్గంలో చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు భోజనం తినడానికి సరైన వసతులు లేవన్నారు. పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో చాలా చోట్ల వంట గదులు భోజనశాలలను సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనాన్ని అధికారులు బాధ్యతగా తీసుకొని చేపట్టాలన్నారు. వంటలు వడ్డించేటప్పుడు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నా రు. కోవూరు నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు ఎక్కువ ఉంటాయని, ఆయా ప్రాంతాల్లో సిసి రోడ్లు, సైడ్ డ్రైన్స్, స్మశానాలు గడిచిన 24 నెలలుగా చాలా ప్రాంతాల్లో అభివృద్ధి చేసుకుంటు న్నామన్నారు. ఇంకా చాలా వరకు చేయాల్సి ఉందన్నారు. వాటికి సంబంధించిన పనులకు జడ్పీ నిధులు మంజూరు చేయాలని కోరారు.

**జడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ** సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అన్ని సమస్యలను ఆయాశాఖాల అధికారులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

❖ ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్ఈ కోటేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయభాస్క ర్, డిఇఒ ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, డిఆర్‌డిఎపిడి నాగరాజు కుమారి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవేణి, జలవనరులశాఖ ఎస్ఈ దేశ్‌నాయక్, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, డిఎంఅండ్‌హెచ్‌వో సుజాత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పులిగిలపాడులో క్రషర్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ



**రాపూరు, జూన్ 10, ప్రభాతవార్త** మండలంలోని పులిగిలపాడు గ్రామ సమీపంలో నూతనంగా జికె మైనింగ్ కంపెని ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్టోన్ క్రషర్ ఏర్పాటుపై బుదవారం సంబందింత భూమిలో ప్రజాభిప్రాయ సేకరణను జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్బంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జికె మైనింగ్ కంపెని ఆధ్వర్యంలో పులిగిలపాడు గ్రామంలోని సర్వే నెం.6/పి, 6/పి1సిలో 28.932 హెక్టార్‌ల లీజు స్థలంలో సాలీన రోడ్ మెటల్ అండ్ బ్యాలస్ట్‌బిల్డింగ్ స్టోన్ 10,22,797 టన్నులు మైనింగ్ మరియు సాలీనా మొర్రం గ్రావెల్ మరియు ఆర్డినరి ఎర్త్ క్వారీ 1,00,278 టన్నులు ఏడాదికి మైనింగ్ చేసేందుకు ధరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందుకు సంబందించి పరిశ్రమలు శాఖ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు క్రషర్ ఏర్పటుకు సంబందించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్బంగా బోజ్జనపల్లి గ్రామానికి చెందిన మూరంరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి, వీరాయపాళెంకు చెందిన బెల్లంకోండ అంకయ్య, రావిగుంటపల్లికి చెందిన రమేష్, పులిగిలపాడుకు చెందిన వెంకటేశ్వర్లు మరి కోంత మంది తమ గ్రామంలో ఇప్పటికే వున్న క్రషర్‌లు, చెత్త ఫ్యాక్టరీ వల్ల ప్రజలు అనేక వ్యాధుల భారిన పడి మృతి చెందుతున్నారని,అనేక మూగజీవాలు,బ్లాసింగ్ వల్ల మృతి చెందాయని అందువల్ల తమకు ఈ క్రషర్ ఏర్పాటు చేయడం తగదని కోరారు. మరి కోంత మంది పులిగిలపాడు, రావిగుంటపల్లి గ్రామానికి చెందిన ప్రజలు మాట్లాడుతూ క్రషర్‌ల ఏర్పాటు వల్ల తమ గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని, కూలీలకు పనులకు వలస వెల్లే భాద తగ్గుతుందని అందువల్ల క్రషర్ ఏర్పాటు చేయాలని కోరారు.ఇదే సమయంలో తమ గ్రామంలో ఎక్కువగా వున్న తాగునీటి సమస్యను తీర్చేందుకు తెలుగుగంగ కాలువ నుండి పైప్ లైన్ వేయించాలని, ప్రతి మూడు నెలలకు ఒక సారి ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడంతో పాటు,స్థానికులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. ప్రజల అభిప్రాయాన్ని రికార్డు చేసి ఉన్నతాధికారులకు పరిశీలన నిమిత్తం పంపించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ,తహాశిల్దార్ లక్ష్మీనరసింహం, జికె మైన్స్ నిర్వాహకులు కృష్ణం రాజు, రాపూరు సోసైటీ అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, రాపూరు సిఐ శ్రీనివాసులు , ఎస్ఐ కె. తిరుమల రావు, పెద్ద ఎత్తున బోజ్జనపల్లి పంచాయితీలోని ప్రజలు వున్నారు.

## మంత్రులకు ఆత్మీయ స్వాగతం పలికిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త - వైద్యం:** నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఎండి ఫరూక్, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఫరూక్‌లు జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకషంగా చర్చించారు. తదనంతరం మంత్రులు డిఆర్సి సమావేశానికి హాజరైయ్యారు.

## జూన్ 17న నార్త్ రాజుపాలెంలో మెగా జాబ్ మేళా



- 15 ప్రముఖ కంపెనీల్లో 2100 ఉద్యోగ అవకాశాలు
- నిరుద్యోగ యువతకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు

**కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల జూన్ 17వ తేదీన కోవూరు నియోజకవర్గంలో భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నార్త్ రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, వీటి ద్వారా దాదాపు 2100 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే వివరించారు. 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, బీ.టెక్, బీ.ఫార్మసీ, పీజీ చదివిన అభ్యర్థులందరికీ వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. 18 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల విద్యార్హతలు, అనుభవాన్ని బట్టి నెలకు కనీసం రూ.12,000 నుంచి గరిష్ఠంగా రూ.25,000 వరకు జీతం ఉంటుందని, కొన్ని కంపెనీలలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారని ప్రశాంతి రెడ్డి తెలిపారు. నియామకమైన వారు కంపెనీల అవసరాలను బట్టి నెల్లూరు, నాయుడుపేట, ముత్తుకూరు సెజ్, శ్రీసిటీ సెజ్‌తో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కోవూరు నియోజకవర్గంలో స్థానిక యువతకు ఉద్యోగాలు అందించేందుకు నిరంతరం కృషి జరుగుతోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో స్థానిక అవసరాల కోసం మండల స్థాయిలో 7 మినీ జాబ్ మేళాలు నిర్వహించగా, 698 మంది హాజరయ్యారని, అందులో 277 మంది ఎంపికయ్యారని తెలిపారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025 - 26)లో ఇప్పటివరకు నియోజకవర్గం, జిల్లా స్థాయిలో 3 మెగా జాబ్ మేళాలు నిర్వహించామని, వీటికి 798 మంది అభ్యర్థులు హాజరుకాగా 378 మంది ప్రతిష్టాత్మక కంపెనీలకు ఎంపికయ్యారని ఎమ్మెల్యే వెల్లడించారు. యువత నైపుణ్యాలను ఉద్యోగాలుగా మార్చేందుకు ఈ జాబ్ మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని, జూన్ 17న జరిగే ఈ మెగా జాబ్ మేళాకు అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరై సద్వినియోగం చేసుకోవాలని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు.

## మాజీ మంత్రి ప్రసన్నతో .. జిల్లా అధ్యక్షుడు కాకాణి భేటీ



కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త : జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి.. మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని బుధవారం నెల్లూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 12వ తేది కోవూరులో జరగబోయే నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లతో ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సుకు సంబంధించి పలు విషయాలు ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం పార్టీకి సంబంధించిన పలు విషయాలపై కూడా వీరు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు, ఏపీఎల్‌డీఏ చైర్మన్ విజయకుమార్, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు అనిల్‌బాబు, వైసీపీ మండల కన్వీనర్లు మావులూరు శ్రీనివాసులురెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, చిమట శేషగిరి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఉదయభాస్కర్, బిరదవోలు రూప్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## నెల్లూరులో ఘరానా చోరీ కేసు ఛేదన

**- రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం - నలుగురు నిందితులు అరెస్ట్**




**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త – క్రైం:** నగరంలోని పెద్దబజార్‌లో జరిగిన భారీ చోరీ కేసును చిన్నబజార్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులతో పాటు ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి సుమారు రూ. 10 లక్షల విలువైన 145.300 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను బుధవారం తన కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పి దీక్ష వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు ఈనెల రెండో తేదీ పెద్దబజార్ ప్రాంతానికి చెందిన షేక్ అజ్మత్ తన ఇంటికి రాగా, బీరువా లాకర్ తెరిచి ఉండటాన్ని గమనించారు. అందులోని బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి, ఆమె వెంటనే చిన్నబజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సౌజన్య పర్యవేక్షణలో, నెల్లూరు టౌన్ ఏఎస్పి దీక్ష ఆధ్వర్యంలో చిన్న బజార్ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు, జూన్ 9న పెద్దబజార్, డైకస్ రోడ్ సెంటర్ సమీపంలోని చేపల మార్కెట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న షేక్ ఇర్ఫాన్ (19), మొహమ్మద్ ఆబిద్ (20)లతో పాటు ఇద్దరు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో, వారి నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన చిన్నబజార్ సీఐ ఎస్. శ్రీనివాసరావు, ఎస్ఐలు రజాక్, అయ్యప్ప, వారి క్రైమ్ సిబ్బందిని జిల్లా ఇంచార్జి ఎస్పీ, టౌన్ ఏఎస్పీ అభినందించి రివార్డులు అందచేశారు.

## మృతి చెందిన కుడుముల శేషమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి కాకాణి

**తోటపల్లి గూడూరు, జూన్ 10, ప్రభాతవార్త:** తోటపల్లి గూడూరు మండలం కోవెరపాలెం గ్రామంలో స్థానిక నాయకులు, మాజీ సర్పంచ్ తలమంచి సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన కుడుముల శేషమ్మ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం



గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. వెన్నుపోటుకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, ఈ నెల 12న భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కూటమి పాలనలో రైతులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అదే విధంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించిన కాకాణి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రజా సమస్యలపై బహిరంగ చర్చకు రావడానికి జంకుతున్నారని ఆరోపించారు. కోవెరపాలెం గ్రామంలో తలమంచి సురేంద్రబాబు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్, తలమంచి సురేంద్రబాబు, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా యూరియా పంపిణీ సరికాదు

## జిల్లా రైతు విభాగం అధ్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి

**బుచ్చి జూన్ 10 ప్రభాతవార్త :** రైతులకు ఎపిఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని జిల్లా టిడిపి రైతు విభాగం అధ్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ముందే కార్డు ద్వారా యూరియా పంపిణీ విధానాన్ని రైతులు వ్యతిరేఖిస్తుంటే యాప్ ద్వారా పంపిణీ అని చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రైతులందరు చదువుకున్న వారు కాదని 80 శాతం అంతంత మాత్రం చదువుకున్న వారేనని ఆయన స్పష్టం చేశారు. ఈవిధానం సరికాదని పలువురు రైతులు తన వద్ద ఆవేదన వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఈవిషయాన్ని కోవూరు



శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## నవాబుపేట పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**- 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త–క్రైమ్:** జిల్లా ఇంచార్జి ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య సూచనలతో, నవాబుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్, వేణుగోపాల్ నగర్ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో నవాబుపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొంది. ఆపరేషన్ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని నివాసాలు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, ఇతర కదలికలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా వాహనాల పత్రాలను పరిశీలించగా, సరైన పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకుని తదుపరి పరిశీలన నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్థానిక ప్రజలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్ రెడ్డి మహిళలపై నేరాల నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోడ్డు భద్రతా నియమాల పాటింపు, గంజాయి తదితర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, బెట్టింగ్‌లు మరియు ఇతర అక్రమ కార్యకలాపాల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యక లాపాల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియ ంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నివారణ కోసం జిల్లాలో ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని పోలీసు లు తెలిపారు.

## బీహార ఘటనలో మృతి చెందిన వారి మృతదేహాలు సంగంకి రాక




**సంగం జూన్ 10 ప్రభాతవార్త :** భీహార్‌రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగంకు చెందిన హజరత్తయ్య మృతదేహం స్వగ్రామమైన సంగంకి చేరుకుంది. అలాగే వెంకటేశ్వర్లు మృతదేహం నెల్లూరులోని ఆయన నివాసానికి చేర్చారు. చెన్నై ఎయిర్‌పోర్టు నుండి మృతదేహాలను తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎస్ఐ బోజ్యానాయక్ స్వగ్రామానికి చేర్చారు. మృతదేహాల రాకతో కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు. తీర్థయాత్రలకు వెళ్ళి తిరిగిరాని లోకాలకు వెళ్లారని కన్నీటి పర్యంతం అయ్యారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అధికారులు హామి ఇచ్చారు. భీహార్ ప్రమాద బాధితుల స్వగ్రామాలకు మృతదేహాల తరలింపులో ప్రభుత్వం ప్రత్యేక్క చర్యలు తీసుకుంది.

## కావలి డిఎస్‌పిని కలిసిన డాక్టర్ మైనంపాటి

**కావలి, జూన్ 10 ప్రభాతవార్త :** కావలి డిఎస్‌పి వాకా వెంకటరమణ కుమార్‌ను బుధవారం జై భీమ్రావు భారత పార్టీ నెల్లూరుజిల్లా అధ్యక్షులు మైనంపాటి యేసురత్నం బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మైనంపాటి ఏసురత్నం మాట్లాడుతూ ఈనెల 17న పట్టణంలోని నియోజకవర్గ జైభీమ్రావు భారత్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంకు




ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమానికి బిజెపి వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ న్యాయమూర్తి, హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ రావడం జరుగుతుందని తెలిపారు. అదేరోజు పట్టణంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ర్యాలీకి అనుమతి కోరుతూ డిఎస్‌పిని కలవడం జరిగిందని తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు.

## వెలుగు కార్యాలయంలో సీడ్ క్యాపిటల్ లబ్దిదారులకు శిక్షణా కార్యక్రమం

**సంగం జూన్ 10 ప్రభాతవార్త :** సంగం వెలుగు కార్యాలయంలో సీడ్ క్యాపిటల్ లబ్దిదారులకు వెలుగు డిపిఎం మధు సూదన్‌రావు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. డిఆర్‌డిఏ, ఆర్సెట్, స్వర్ణభారత్ ట్రస్టు మరియు బ్యాంకు



అధికారుల ఆధ్వర్యంలోమహిళలకు వీడియోల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మహిళల ఆర్దికాభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం రుణాల మంజూరు చేస్తుందని అన్నారు. గతంలో మండలంలో 22 మంది మహిళలకు 40 వేల చొప్పున సీడ్ క్యాపిటల్ రుణాలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పాతరుణం సకాలంలో చెల్లించిన వారికి కేవలం 6 శాతం వడ్డితోనే మరో 75 వేలు అదనపు రుణం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వ్యాపారుల విస్తరణకు పిఎంఎస్‌ఈ పథకం ద్వారా 35 శాతం భారీ సబ్సిడి వస్తుందని 5 లక్షల నుండి 10 లక్షల వరకు రుణాలు పొంది పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసుకునే సువార్ణ అవకాశం అని దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలోఆర్ఎస్ఇటిఐ డైరెక్టర్ కాశయ్య, కెనరాబ్యాంకు పైనాన్సియల్ లిట్రసీ డిస్ట్రిక్ట్‌కో ఆర్డినేటర్ రవిశంకర్, సంగం ఎపిఎం రవి శంకర్‌రెడ్డి, ఎపిఎం నాన్ ఫారం నాగేంద్ర ప్రసాద్ పొదుపు మహిళలు పాల్గోన్నారు.

## ఇంటి నుంచే కరెంట్ బిల్లు చెల్లించండి

**- సమయం, డబ్బు ఆదా చేసుకోండి - జిల్లాలో విస్తృతంగా డిజిటల్ పేమెంట్స్ అవగాహన కార్యక్రమాలు - ఏపిఎస్‌పిడిసిఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా సులభంగా బిల్లు చెల్లింపు - యుపిఐ, క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటి నుంచే కరెంట్ బిల్లులు చెల్లించే అవకాశం - బిల్లు ఆలస్యమైతే లేట్ పేమెంట్ చార్జీలు - వినియోగదారులు జాగ్రత్త**

**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త – వైద్యం :** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ ఐఏఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో పెద్ద ఎత్తున డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే. రాఘవేంద్రం తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది వినియోగదారులకు డిజిటల్ చెల్లింపులపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వినియోగదారులు ఇంటి నుంచే ఎంతో



సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించుకునే విధంగా ఏపిఎస్‌పిడిసిఎల్ పలు ఆన్‌లైన్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. వినియోగదారులు ఏపిఎస్‌పిడిసిఎల్ పై క్లిక్ చేసి తమ 13 అంకెల సర్వీస్ నెంబర్ నమోదు చేయాలి. అనంతరం క్యాప్చా ఎంటర్ చేస్తే బిల్లు వివరాలు కనిపిస్తాయి. తర్వాత బిల్ డెస్క్ పై క్లిక్ చేస్తే వివిధ చెల్లింపు విధానాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. క్రెడిట్, డెబిట్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, వాలెట్, క్యాస్ కార్డ్స్, క్యూఆర్ కోడ్, యుపిఐ వంటి విధానాల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చున్నారు. ముఖ్యంగా యుపిఐ ద్వారా పోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌లతో సులభంగా చెల్లింపులు చేయవచ్చని వివరించారు. అలాగే కరెంట్ బిల్లు దిగువ భాగంలో ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూడా వెంటనే బిల్లు చెల్లించవచ్చన్నారు. డిజిటల్ పేమెంట్స్ ద్వారా క్యూ లైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే బిల్లులు చెల్లించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల వినియోగదారుల విలువైన సమయం ఆదా కావడంతో పాటు రవాణా ఖర్చులు, నగదు సేకరణ ఇబ్బందులు మరియు ఇతర అదనపు వ్యయాలు తగ్గుతాయని పేర్కొన్నారు. అలాగే బిల్లు జారీ చేసిన తేదీ నుండి 14 రోజులలోపు బిల్లు చెల్లించకపోతే లేట్ పేమెంట్ చార్జ్ విధించబడతాయని తెలిపారు. నెలరోజులు దాటితే లేట్ పేమెంట్ చార్జ్‌తో పాటు రూ.100 ఆర్‌సీ ఫీజు కూడా విధించబడుతుందని హెచ్చరించారు. అందువల్ల వినియోగదారులు అదనపు చార్జీలు పడకుండా ఉండేందుకు డిజిటల్ పేమెంట్స్‌ను వినియోగించి సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కోరారు.

## విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించగలం

**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు రూరల్ గాంధీనగర్‌లోని ఆర్ఎస్ఎన్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన నూర్ భాషా విద్యార్థినీ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల వేదిక కార్యక్రమంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించగలమని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఏపీ వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో తాలిం ఏ కార్యక్రమాన్ని తీసుకొచ్చామని, అందులో 250 మంది సెలెక్ట్ అయ్యారని తెలిపారు. ఇక్కడ ఉన్న విద్యార్థుల్లో కూడా ఇద్దరు టాలెంట్ టెస్టులో ప్రతిభ సాధించారని తెలిపారు. గొప్ప ధనవంతుల పిల్లలు ఏ విద్యాసంస్థల్లో అయితే చదువుతారో అదే విద్యాసంస్థల్లో ఈ 250 మందిని చదివిస్తున్నామని అన్నారు. విద్యతోనే సమాజం బాగుపడుతుందని, ఈ 250 మంది ఉన్నత స్థానానికి చేరి వీరు మరో 250 మందికి చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## భారత ప్రధాని నరేంద్ర మోడీ పేరు మీద జొన్నవాడలో పూజలు

**బుచ్చి జూన్ 10 ప్రభాతవార్త :** భారత ప్రధానిగా నరేంద్రమోడీ కొత్త మైల్‌స్టోన్ జూన్ 10 తో నెహ్రూరికార్డుని బ్రేక్ చేశారని బిజెపి నాయకులు ,జొన్నవాడ దేవస్థానం ట్రస్టుబోర్డుమెంబర్ కీలుకుప్ప శ్రీనివాసులు కొనియా డారు. 2026 జూన్ పదోవ తేదితో ప్రధాని నరేంద్రమోడీ సరికొత్త రికార్డు సాధించారని ప్రశంసించారు. ఎన్నికైన ప్రధానిగా ఎక్కువ కాలం పనిచేసిన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 4398



రోజులు ప్రధానిగా పనిచేస్తే 2004 మే 26 న తొలిసారిగా బాధ్యతలు చేపట్టి ప్రధాని నరేంద్రమోడీ 4399 రోజులు పూర్తి చేసుకొని నెహ్రూరికార్డుని అధిగమించారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యనరకమంలో జొన్నవాడ దేవస్థానం మెంబర్ కీలుకుప్ప శ్రీనివాస్‌యాదవ్, బిజెపి కిసాన్‌మోర్చ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పార్లపల్లి వెంకట మహేష నాయుడు, బిజెపినాయకులు మహిమలూరు శ్రీనివాసులు, మరియు బిజెపి సీనియర్‌నాయకులు సన్నపురెడ్డి అంకిరెడ్డి, మన్నవరపు బాబు తదితరులున్నారు.

## కోవూరు నియోజకవర్గంలో ఊహించని స్థాయిలో అభివృద్ధి

**– ఎస్ఐఆర్‌పై బూత్ లెవల్ ఏజెంట్లు అవగాహన పెంచుకోవాలి**




**కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల్లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో ఊహించని విధంగా అభివృద్ధి పనులు చోటు చేసుకున్నాయని టీడీపీ సీనియర్ నేతలు తెలిపారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం కోవూరు మండల టీడీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గత రెండు సంవత్సరాల్లో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించేలా దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా యూరియాపై రైతుల్లో ఆందోళన ఉందని, దీనిపై కూడా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జిల్లా వ్యవసాయ అధికారులతో, కలెక్టర్‌తో మాట్లాడారని, దీనిపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రధానంగా ప్రతి నాయకుడు వారి వారి పరిధిలో ఓటర్లు సక్రమంగా ఉండేలా ఈ ఎస్ఐఆర్ కార్యక్రమంలో దృష్టి పెట్టాలన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయబావుటా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బమల్లారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గాదిరాజు సుధాకర్, పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ వెంకటరమణమ్మ,, శ్రీనివాసులు, పెంచలయ్య,, ఆదాల శివారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, సునీల్‌కుమార్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు సాయి జశ్వంత్‌రెడ్డి, సాయి రెడ్డి, మధుసూదన్‌రావు, రమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జులు టీడీపీ సీనియర్ నాయకులు, తదితరులు ఉన్నారు.

## బడులు తెరిచేలోపు పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ

**కావలి, జూన్ 10 ప్రభాతవార్త :**ఈనెల 12వ తేదీన పాఠశాలలు ప్రారంభం కానునుండడంతో మండలంలోని పాఠశాలలన్నింటికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని గత కొన్ని రోజులుగా చేపట్టినట్లు బుధవారం మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 20 ఉన్నత, 10 ప్రాథమికోన్నత , 85 ప్రాథమిక పాఠశాలలకు బుధవారం



నుండి విద్యాశాఖ ఆధ్వర్యంలో నేరుగా పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్ ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని పాఠశాలలకు కలిపి 52,769 పాఠ్యపుస్తకాలు, 55,949 నోటు పుస్తకాలు, 6892 బెల్టులు, పదివేల 54 యూనిఫామ్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖ నుండి విద్యాసామాగ్రి వచ్చిన వెంటనే పాఠశాలలకు తరలిస్తామని తెలిపారు. పాఠశాల గదులు ఆవరణలను శుభ్రం చేయించడంతో పాటు ఎలక్ట్రిసిటి, వాటర్ తదితర విభాగాల్లో మరమ్మత్తు పనులను సరిచేయాలన్నారు. మధ్యాహ్న బోజనం కుకింగ్ ఏజెన్సీలకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న పలువురు సిఆర్‌ఎంటిలు పాల్గొన్నారు.

## తరచూ తలనొప్పి, మూర్ఛలు, చూపు మందగించడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

**– మెడికవర్ హాస్పిటల్ న్యూరోసర్జన్ డాక్టర్ దినేష్ గంగాపట్నం**



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు తరచూ తలనొప్పి వస్తోందా? కారణం లేకుండా వాంతులు అవుతున్నాయా? మూర్ఛలు, చూపు మందగించడం, శరీరంలో ఒక వైపు బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తున్నాయా? అయితే వాటిని సాధారణ సమస్యలుగా తీసుకోవద్దని మెడికవర్ హాస్పిటల్ గంగాపట్నం న్యూరోసర్జన్ డాక్టర్ దినేష్ హెచ్చరిస్తున్నారు. ఇవి కొన్ని సందర్భాల్లో బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించిన ప్రారంభ సంకేతాలు కావచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం ఆధునిక వైద్య సాంకేతికత అందుబాటులోకి రావడంతో బ్రెయిన్ ట్యూమర్ల నిర్ధారణ, చికిత్సలో విశేష పురోగతి సాధ్యమైందన్నారు. బ్రెయిన్ ట్యూమర్ అనేది మెదడులో లేదా దాని చుట్టుపక్కల కణజాలంలో ఏర్పడే అసాధారణ కణాల పెరుగుదల. ఇది నిరపాయమైనదైనా, ప్రాణాంతకమైనదైనా మెదడు పనితీరుపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ట్యూమర్ ఉన్న ప్రదేశాన్ని బట్టి లక్షణాలు మారుతుంటాయి. తలనొప్పి, మూర్ఛలు, మాట తడబడటం, జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు, నడకలో అసమతుల్యత, చూపు లేదా వినికిడి సమస్యలు వంటి లక్షణాలు కనిపించవచ్చన్నారు. ఈ సందర్భంగా డా.దినేష్ గంగాపట్నం కన్సల్టెంట్ న్యూరోసర్జన్, మెడికవర్ హాస్పిటల్స్ మాట్లాడుతూ చాలామంది తలనొప్పిని సాధారణ సమస్యగా భావించి నెలల తరబడి నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే తలనొప్పితో పాటు మూర్ఛలు, చూపులో మార్పులు, శరీర బలహీనత వంటి లక్షణాలు ఉంటే వెంటనే నిపుణులను సంప్రదించాలి. ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వంటి ఆధునిక పరీక్షల ద్వారా బ్రెయిన్ ట్యూమర్లను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చు. ప్రస్తుతం మైక్రో న్యూరోసర్జరీ, న్యూరో నావిగేషన్, ఆధునిక రేడియేషన్ థెరపీ వంటి సాంకేతికతలతో అనేక మంది రోగులకు విజయవంతమైన చికిత్స అందించడం సాధ్యమవుతోంది అని తెలిపారు. ప్రజలు నరాల సంబంధిత లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా బ్రెయిన్ ట్యూమర్‌ను ముందుగానే గుర్తించి మెరుగైన చికిత్స పొంద వచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**కొడవలూరు, జూన్ 10 ప్రభాతవార్త:** మండల పార్టీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సమన్వయ సమావేశంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో జరుగుతున్న మార్పులు, చేర్పులపై సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిందని, ఈ కాలంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమన్వయంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, గ్రాంట్లు సాధిస్తూ లోటు బడ్జెట్ను అధిగమించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యోగులు, అధికారులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడంతో పాటు రూ.4 వేల పింఛన్లు అందజేస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన వారికి కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడారు. విడవలూరు మండలంలో గతంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉండేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో కాలువల పూడికతీత పనులు చేపట్టడంతో మొదటి, రెండో పంటలకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. దీంతో రైతులకు ఊరట లభించిందని, నియోజకవర్గ అభివృద్ధికి దశలవారీగా కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పార్టీ నాయకులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేలను పర్యవేక్షిస్తూ, మరణించిన వారి పేర్ల తొలగింపు, గ్రామాల్లో నివసించని వారి ఓట్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాల్లో నిర్లక్ష్యం చేయరాదన్నారు. మరో నాలుగు, ఐదు నెలల్లో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించడం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా కీలకమని, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ల వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.

## దళితుల జోలికి వస్తే తాటతీస్తాం

**కావలి, జూన్ 10 ప్రభాతవార్త :** దళితుల జోలికివస్తే తాట తీస్తామని కావలి టిడిపి ఎస్సీ సెల్ నాయకులు మండిపడ్డారు. కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం గ్రామంలో టిడిపి మాజీ సర్పంచ్,



దళిత నాయకుడు అరగల క్రిష్ణయ్యపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు దావులూరు దేవకుమార్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు ప్రభుదాస్, టిడిపి నాయకులు పరిశు సురేస్ తదితరులు మాట్లాడారు. చెన్నాయపాలెం గ్రామానికి చెందిన వైసిపి మాజీ ఏఎంసి ఛైర్మెన్ సన్నిబోయన ప్రసాద్ సోదరుడు ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావుతో పాటు మరి కొందరు కత్తులతో దాడి చేశారని ఆరోపించారు. దళితులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే టిడిపి నాయకులు, దళిత సంఘాలు ఊరుకోబోమని స్పష్టం చేశారు. వైసిపి పాలనలో దళితులనే లక్ష్యంగా చేసుకొని అనేక వేధింపులు, దాడులు జరిగాయని ఆరోపించారు. క్రిష్ణయ్య రాజకీయంగా ఎదుగుతున్నారనే కారణంతోనే ఆయనపై దాడి చేయడం జరిగిందన్నారు. గ్రామంలో టిడిపి బలపడుతుంటే చూసి కొందరు జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులు మాజీ ఎమ్మెల్యే వద్ద ఉన్నారని ఆరోపించారు. వారిని గుర్తించి పోలీసులకు అప్పచెప్పి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఒత్తిళ్ళకు గురికాకుండా దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవోదయలో మరో సీటు సాధించిన సుబ్రహ్మణ్య విద్యార్థిని

**వింజమూరు, జూన్ 10, ప్రభాతవార్త** జవహర్ నవోదయ విద్యాలయ మంగళవారం విడుదలైన మూడో విడత కౌన్సెలింగ్‌లో వింజమూరుకు చెందిన శ్రీ సుబ్రహ్మణ్య నవోదయ సైనిక్ అకాడమీ విద్యార్థిని పోలు అమూల్య సీటు సాధించి సత్తా చాటింది. అమూల్య విజయం సాధించడంతో క్యాంపస్‌లో సంబర వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ బి. సురేంద్ర రాజు విద్యార్థినిని ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన




మాట్లాడుతూ మా సంస్థ ఆరంభం నుంచే సంచలన ఫలితాలు సాధిస్తోంది. ప్రతి ఏటా అదే ప్రభంజనంతో ముందుకు సాగుతున్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులను పట్టణ కార్పొరేట్ సంస్థలకు ధీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతోనే శ్రీ సుబ్రహ్మణ్య విద్యాసంస్థను ఏర్పాటు చేశాం. నాణ్యమైన విద్యను మన ప్రాంతంలోనే అందించడమే మా లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో తమ సంస్థ నుంచి పలువురు విద్యార్థులు సీట్లు సాధించారని ఆయన గుర్తుచేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు పి. ప్రమీల కుమార్ రెడ్డి మాట్లాడుతూ నవోదయలో సీటు సాధించాలనేది మా కల మా పాపపై ఎంతో శ్రద్ధ చూపి, లక్ష్యం దిశగా విద్యనందించి సీటు సాధింపజేసిన శ్రీ సుబ్రహ్మణ్య యాజమాన్యానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. గ్రామీణ విద్యార్థులకు శ్రీ సుబ్రహ్మణ్య ఒక వరంఅని ఆనందం వ్యక్తం చేశారు.

## అన్నా కాంటీన్‌లో మంత్రి నారాయణ సందడి.

**నెల్లూరు, జూన్ 10 ప్రభాతవార్త :** గతపాలకుల శాడిజంతో పేదల కడుపు కొట్టారు. అన్నా కాంటీన్ల సంఖ్యను ఇంకా పెంచుతాం. తమిళనాడులో లేని విధానం ఏపీలోనే ఎందుకు? గత ప్రభుత్వంపై మంత్రి నారాయణ నిప్పులుమాపై కోపంతో 2.25 లక్షల మంది కడుపు కొట్టారు. నెల్లూరులో మంత్రి నారాయణ సంచలన వ్యాఖ్యలు నెల్లూరు సిటీ లోని ఇందిరాభవన్



రోడ్డులో ఉన్న అన్నా క్యాంటీన్ ను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణఆకస్మిక తనిఖీ చేశారు.. అక్కడ పేదలతో కలిసి స్వయంగా భోజనం చేసిన మంత్రి, వంటల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత పాలకుల శాడిజంతో 2.25 లక్షల మంది పేదల కడుపు కొట్టారని ఆరోపించారు. పక్క రాష్ట్రం తమిళనాడులో ప్రభుత్వం మారినా అమ్మా క్యాంటీన్లు నడుపుతుంటే, ఇక్కడ మాత్రం కక్షసాధింపు చర్యలకు దిగారని మండిపడ్డారు. మళ్లీ కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 270 అన్నా కాంటీన్లను పునఃప్రారంభించి, కేవలం 5 లకే అత్యంత నాణ్యమైన భోజనం అందిస్తూ పేదల ఆకలి తీరుస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత మెరుగుపరిచి, సీఎం చంద్రబాబు నాయుడు గారి హామీ మేరకు అన్నా కాంటీన్ల సంఖ్యను భారీగా పెంచుతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్ మేయర్ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నాయకులు రామకృష్ణ ,పోకల రవి,అజయ్,స్థానిక టిడిపి ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు

## పొణకా కనకమ్మకు భారతరత్న ఇవ్వాలి

- నేలనూతల శ్రీదర్



**బుచ్చి జూన్ 10 ప్రభాతవార్త** :బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం తపించి,మహిళా సాధికారతకు బాటలు వేసి ఎందరో జీవితాలలో వెలుగులు నింపిన పొనకా కనకమ్మకు భారతరత్న ఇవ్వాలని సామాజిక సమరసత వేదిక జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీదర్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ లోని కోనేటిమిట్టలో వున్న శ్రీగోపాలకృష్ణయ్య ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పొణకా కనకమ్మ 134 వ జయంతి వేడుకలను బుధవారం సామాజిక సమరసతా వేదిక ఆద్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు దేశంలో తీవ్ర కరువు పరిస్తితులు ఎదుర్కుంటున్నప్పుడు చల్ల,గంజి కేంద్రాలను నడిపి ప్రజల ఆకలి తీర్చారని పేర్కున్నారు. ప్రతి ఒక్కరు ఆమె స్దాపించిన పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమాన్ని పిల్లలతో కలిసి సందర్శించి మహాత్ముడి సిద్దాంతలైన అహింస ,సత్యాగ్రహం,గాంధీయవాదం అంటే తరాలకు బోధించాలన్నారు. వందేళ్ళ క్రితం కస్తూరిదేవి స్కూల్ రూపకల్పన చేసి ఎందో బాలికల జీవితపూదోటలో అక్షరాలు పూయించారని కొనియాడారు.2500 కోట్లకు పైగా ఆస్తులను సమాజం కోసం దానం చేసి,చదువు సాధికారతకు ప్రతీకగా నిలిచారని అటువంటి పుణ్యమూర్తి పొణకా కనకమ్మకు భారతరత్న ఇవ్వాలని ఆయన కోరారు ఆమె జయంతి సందర్బంగా విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేసి ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో సామాజిక సమరసతావేదిక గౌరవాధ్యక్షులు రమణయ్య, అధ్యక్షులు నరసింహమూర్తి, కార్యదర్శులు గండికోట సుధీర్,రాయపూడి శరత్‌బాబు,మహిళా ప్రముఖ్ అనిత,సభ్యులు గుంజి నాగభూషణం, శ్రీవేణుగోపాలస్వామి దేవస్దానం అధ్యక్షులు ఇనుగూరు సుబ్బారావు, విశ్రాంత ఉపనాౠసకులు కటకం వెంకటసుబ్బయ్య, విద్యార్థులు,ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## నా పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా మార్చేశారు

- బాధితుడు తాండ్ర మీరయ్య కన్నీటి పర్యంతం
- విలేఖరి ముసుగులో యూట్యూబర్ నిర్వాకం



**ఇందుకూరుపేట, జూన్ 10, ప్రభాతవార్త** : జర్నలిజం ముసుగులో చలామణి అవుతున్న ఒక యూట్యూబర్ అండదండలతో, రెవెన్యూ అధికారుల సహకారంతో తన 31 సంవత్సరాల నాటి పట్టా భూమిని రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిగా మార్చేశారని ఇందుకూరుపేట మండలం పాములవారిపాలెం గ్రామానికి చెందిన బాధితుడు తాండ్ర మీరయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన గ్రామస్తులు, పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలతో కలిసి ఇందుకూరుపేట తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో తనపై, తన కుటుంబంపై జరుగుతున్న అన్యాయాన్ని వివరించి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా బాధితుడు తాండ్ర మీరయ్య మాట్లాడుతూ తాను 1995వ సంవత్సరంలో ఆల్తూరు శివకుమార్ రెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి పాములవారిపాలెం పొలాల్లోని సర్వే నంబర్ 393/1 లో గల 10 సెంట్ల పట్టా భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశానని తెలిపారు. గత 31 ఏళ్లుగా ఆ భూమిని తానే స్వయంగా సాగు చేసుకుంటున్నానని, అన్ని రకాల ఆధారాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. అయితే, స్థానికంగా విలేకరినని చెప్పుకుంటూ ఎలాంటి అనుమతులు లేకుండా యూట్యూబ్ ఛానల్ నడుపుతున్న ఒక వ్యక్తి, స్థానిక రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి లేదా వారి సహకారంతో తన సొంత పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో మార్పించేశాడని ఆరోపించారు. 'ముప్పై ఏళ్లకు పైగా నా ఆధీనంలో ఉన్న భూమిని, విలేకరి అనే ముసుగుతో అధికార దుర్వినియోగానికి పాల్పడి రికార్డులు మార్చడం ఎంతవరకు సమంజసం? అని మీరయ్య ప్రశ్నించారు. ఎక్కడో లండన్ దేశంలో ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడిన తన కుమారుడు, కుమార్తె, అల్లుళ్లపై కూడా తప్పుడు కేసులు పెట్టించి మానసిక చిత్రహింసలకు గురిచేస్తున్నాడని వాపోయారు. అంతేకాకుండా, 80 సంవత్సరాల వయసు పైబడిన తన వృద్ధ తల్లిపై సదరు వ్యక్తి దాడికి తెగబడ్డాడని, పైగా తామే ఆయనపై దాడి చేసినట్లు రివర్స్ కేసులు పెట్టించి పోలీసులను సైతం ప్రభావితం చేస్తున్నాడని మీరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులు వాస్తవాలు గ్రహించకుండా, కేవలం ఆ యూట్యూబర్ చెప్పిన మాటలు నమ్మి ఆయనకే వత్తాసు పలుకుతుండడం దారుణమన్నారు. విలేకరినని చెప్పుకుంటూ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతున్న ఈ వ్యక్తి వల్ల కేవలం తాను మాత్రమే కాకుండా, ఇందుకూరుపేట మండలంలో అనేకమంది సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈయన చేతిలో మోసపోయిన బాధితులు మండలంలో చాలా మంది ఉన్నారని మీరయ్య పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా యూట్యూబ్ ఛానల్ నడుపుతూ, ప్రెస్ అనే బోర్డు పెట్టుకుని తిరుగుతున్న సదరు వ్యక్తిపై మరియు అతనికి సహకరించిన అధికారులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, తన 10 సెంట్ల పట్టా భూమిని తనకు దక్కేలా న్యాయం చేయాలని బాధితుడు తాండ్ర మీరయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితుడికి మద్దతుగా పాములవారిపాలెం గ్రామానికి చెందిన మహిళలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త - అగ్రికల్చర్ :** యోగ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నెల్లూరులోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఉద్యోగులు బుధవారం చైర్ యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, అధికారులు ఉత్సాహంగా పాల్గొని, కార్యాలయ వాతావరణంలో సులభంగా చేయగల యోగాసనాలు, శ్వాసాభ్యాసాలు, ఒత్తిడి నియంత్రణ పద్ధతులను అభ్యసించారు. దీర్ఘకాలం కూర్చుని పనిచేసే ఉద్యోగుల్లో వెన్నునొప్పి, మెడ నొప్పి, మానసిక ఒత్తిడి తగ్గించడంలో చైర్ యోగా ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు వివరించారు. యోగాభ్యాసం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కుదుటపడటంతో పాటు పనితీరు కూడా మెరుగుపడుతుందని తెలిపారు. యోగ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్రతి కార్యాలయంలో యోగాపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది మరియు యోగా శిక్షకులు పాల్గొన్నారు.

## ప్రజల పాలిట శివపార్వతులు : వేమిరెడ్డి దంపతులు



**కొడవలూరు, జూన్ 10 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గ ప్రజల పాలిట నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శివపార్వతుల్లా నిలిచారని టీడీపీ మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు అన్నారు. గతంలో కోవూరు పరిస్థితి ఎలా ఉండేదో నేడు ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుంటున్నారని, ప్రస్తుతం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గం పురోగతి పథంలో సాగుతోందన్నారు.

**- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.** ప్రజల సమస్యల పరిష్కారంలో ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవ చూపుతూ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఎక్కడ ఏ సమస్య ఎదు రైనా వారి దృష్టికి తీసుకెళ్తే వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు,సాగునీరు,విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగు తున్నాయని చెప్పారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల ఫలితాలను ప్రజల్లోకి తీసుకె ళ్ల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులంతా సమన్వయంతో, కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

**(కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త :** కోవూరులోని పడుగుపాడు రైల్వే స్టేషన్ పరిధిలో కిలోమీటర్ 176/37 మధ్య సుమారు 20 నుంచి 30 సంవత్సరాలు వయస్సు గల వ్యక్తి రైలు నుంచి జారి పడి తీవ్రగాయాలపాలై మరణించాడు. సదరు వ్యక్తి జేబులో ఒంగోలు నుంచి చెన్నై సెంట్రల్‌కు వెళ్లే జనరల్ టికెట్ ఉంది. జేబులో నేపాల్‌కు సంబంధించిన 20 రూపాయల నోటు కూడా ఉండడంతో ఈ వ్యక్తి నేపాల్ వాసిగా రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. తెలుపు రంగు టీషర్టు, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు కావలి జీఆర్‌పీ పోలీసులను 9247575630 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## ప్రైవేట్‌కు దీటుగా అంగన్‌వాడీలు




**కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త :** కోవూరులోని రాళ్లమిట్ట ప్రాంతంలో బుధవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడుతూ ప్రైవేట్ కాన్వెంట్‌లకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తు న్నాయన్నారు. తమ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు వీడియో రూపంలో తెలియజేయడమే కాకుండా బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. ఇటువంటి మంచి వసతులు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు, తదితరులు ఉన్నారు.

## నెల్లూరు జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్‌ని కలిసిన నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. కాలేషా



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త - సిటీ:** నెల్లూరు జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్‌ని బుధవారం నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్. కాలేషా సంఘ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెంబర్ 43 ప్రకారం 5 శాతం రిజర్వేషన్ అమలుపరచి దివ్యంగుల స్వయం సహాయక సంఘాల గ్రూపులను ఏర్పాటు చేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్‌ను కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో జీ.వో ఎం.ఎస్ నెంబర్ 43 ప్రకారం 5 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. అందులో భాగంగానే దివ్యాంగుల స్వయం సహాయక సంఘాల గ్రూపులు ఏర్పాటు చేయడంలో రిజర్వేషన్ పాటించాల్సి వున్నా నెల్లూరు జిల్లా మెప్మా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాల గ్రూపులు గత కొన్ని సంవత్సరాలుగా ఏర్పాటుకు నోచుకోలేదని విచారం వ్యక్తం చేశారు. అందుకు ప్రధాన కారణం ప్రాజెక్టు డైరెక్టర్‌తో పాటు సిటీ మిషన్ మేనేజర్, కమ్యూనిటీ ఆర్గనైజర్, రిసోర్స్ పర్సన్‌ల మధ్య సరైన అవగాహన లేకపోవడంతో గ్రూపులు ఏర్పాటు చేయలేదని తెలిపారు.మహిళా స్వయం సహాయక సంఘాల గ్రూపులు వేల సంఖ్యల్లో ఏర్పాటు చేసి దివ్యాంగుల గ్రూపులను మాత్రం గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాము ఎప్పటికప్పుడు ఈ విషయాలను ఉన్నతాధికారులు చెబుతున్న పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు తమ కార్యాలయానికి వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని, కొత్తగా వచ్చిన తమరైన పట్టించుకుని మహిళా స్వయం సహాయక సంఘాల గ్రూపులు ఎన్ని ఉన్నాయో వాటి ప్రకారం 5 శాతం రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగుల స్వయం సహాయక సంఘాల గ్రూపులను దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం వెంటనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.అందుకు కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలను కూడా అర్జీతో పాటు ఇచ్చమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి. ఉమామహేశ్వర లాల్, వాజీద తదితరులు పాల్గొన్నారు.

## సీఏఎం హై స్కూల్‌ను తగలబెట్టడం అమానుషం

- ఈ ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి - ఊరందూరు సురేంద్ర



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 10, ప్రభాతవార్త :** ఎంతోమందికి విద్యనందించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చిన సీఏఎం హైస్కూల్‌ను పరిరక్షించడం అందరి బాధ్యతని పలు రాజకీయ పార్టీల నేతలు, క్రైస్తవ సంఘాలు, ప్రజాసంఘాల నేతలు అన్నారు. ఇటీవల గుర్తు తెలియని దుండగులు హైస్కూల్‌ను తగలబెట్టిన నేపథ్యంలో, వారంతా బుధవారం సిఏఎం హై స్కూల్‌ను సందర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయ ఏవో కు, సిఏఎం హై స్కూల్‌ను తగలబెట్టిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని ఎస్ఐని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ సెల్ ఇంచార్జ్ ఊరందూరు సురేంద్ర మాట్లాడుతూ సిఏ ఎం హై స్కూల్‌ను తగలబెట్టడం అమానుష చర్య అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం క్రైస్తవ సంఘాల నేత కోలా రూబెన్ మాట్లాడుతూ సిఏఎం హైస్కూల్‌ను తగలబెట్టేందుకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్‌ని జిల్లా ఎస్పీని కోరుతున్నామన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సంజయ్ కుమార్ మాట్లాడుతూ క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ కొరకు ఒక బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు మీదూరి కళ్యాణ్ సుందర్ మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ స్కూల్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హై స్కూల్ పై జరిగిన దాడిని అన్ని సంఘాల నేతలు, పూర్వ విద్యార్థులు ముక్తకంఠంతో ఖండించారు. పాఠశాల విలువైన టేకు, వుడెన్, ఫర్నిచర్ తలుపులు తగలబెట్టడం అమానుష చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో డేనియల్ దివాకర్, వేల్పుల సందీప్, షేక్ హఫీజ్, రవికాంత్, సక్సేనా, బాబు సుమన్, జోయల్ తదితరులు పాల్గొన్నారు.

## చేజర్లలో బీజేపీ నేతలు ప్రత్యేక పూజలు



**చేజర్ల, జూన్ 10, ప్రభాతవార్త** : భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోడీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్బంగా చేజర్ల మండల బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా శ్రీరాములు దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరక్టర్ బత్తల కిష్టయ్య పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులు ప్రధాని మోదీపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. వారికి ఆయురారోగ్యాలు, శక్తిని ప్రసాదించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ యువ మోర్చా అధ్యక్షులు శివారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు జగ్గారెడ్డి, మండల కార్యదర్శి ఒర్సు పెంచలయ్య, బీజేపీ కార్యకర్త నంద్యాల సీనయ్య, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొనుగోలుకు ముందుగా వెర్ఫికేషన్ తప్పనిసరి

**చేజర్ల, జూన్ 10, ప్రభాతవార్త** : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు చేపట్టే రైతులు యూరియా, డీఏపీ తదితర ఎరువులను కొనుగోలు చేయాలంటే ముందుగా వెర్ఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి హిమబిందు సూచించారు. రైతులు ప్రస్తుతం సాగు చేసిన లేదా త్వరలో సాగు చేయనున్న పంటల విస్తీర్ణ వివరాలతో పాటు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ లేదా 1బి, నమూనా పత్రాలను తీసుకుని తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రం లేదా గ్రామ వ్యవసాయ సహాయకుని వద్ద వెర్ఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెర్ఫికేషన్ పూర్తయిన అనంతరం మాత్రమే సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల డీలర్ల వద్ద యూరియా, డీఏపీ వంటి ఎరువులను పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఎరువుల కొనుగోలు సమయంలో ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ ఉన్న ఫోన్‌ను వెంట తీసుకెళ్లాలని సూచించారు. రైతులు ముందస్తుగా వెర్ఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకుంటే ఎరువుల కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు పొందవచ్చని అధికారులు తెలిపారు. రైతులందరూ ఈ విషయాన్ని గమనించి అవసరమైన పత్రాలతో వెర్ఫికేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు.

## నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం



**ఉదయగిరి, జూన్ 10, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఆర్టీసీ డిపో డీఎం నేడు ఉదయం 11గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఉదయగిరి డిపో మేనేజర్ ఈ.రమేష్ కుమార్ బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను 9959225095 నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని, వీలైన అన్ని సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. తమ డిపో పరిధిలోని ఉదయగిరి, దుత్తలూరు, సీతారాంపురం, వరికుంటపాడు, వింజమూరు ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. నేరుగా ఫోన్ చేసి అధికారులకు తెలియజేయవచ్చన్నారు.

## పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను పారదర్శకంగా చేపట్టాలి






**కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికను పారదర్శకంగా చేపట్టేలా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక సంస్థ ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీపీ టి. పార్వతి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జీపీడీపీకి సంబంధించి శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రణాళిక ద్వారా గ్రామాల్లోని పేదలను గుర్తించి వారి ఉపాధి కల్పనకు ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆర్థిక సంఘం నిధులను ఒక ప్రణాళికాబద్ధంగా పారదర్శకంగా ఖర్చు పెట్టేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ నిర్దేశించిన సమయాల్లో గ్రామసభలు నిర్వహించి ఈ ప్రణాళికలను ఆమోదం చేసుకునేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ అభివృద్ధి ప్రణాళికలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు, ఆర్థిక అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రణాళికే అన్నారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఐఆర్డీ ఫ్యాకల్టీ ప్రసాద్ పలు విషయాలపై వీడియో ద్వారా అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, తదితరులు ఉన్నారు. అంతకుముందు మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

## ఉదయగిరిలో 45 మందికి నోటీసులు




**ఉదయగిరి, జూన్ 10, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలం కొండాయపాలెం పంచాయతీలోని 250 ఎకరాల అసైన్‌మెంట్ భూములపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో 45 మందికి రెవెన్యూ శాఖా తాజాగా నోటీసులు జారీ చేసింది. ఒక కుటుంబానికి 50 నుంచి 60 ఎకరాలు అసైన్‌మెంట్ భూములు ప్రభుత్వం పంపిణీ చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో తారుమారు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది క్రమంలో విషయం బట్టబయలు అయినట్లు తెలుస్తోంది. 45 మంది అక్రమార్కులకు నోటీసులు జారీ చేసిన విషయం జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. సరైన ధృవపత్రాలతో సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశాలు ఇవ్వడంపై ఎలా ముందుకెళ్లాలి ఏం చేయాలి అనే విషయంపై అక్రమార్కులు తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ కార్యాలయంలో భద్రంగా ఉండాల్సిన ది రిజిస్టర్ అదే శాఖకు చెందిన ఒక వీఆర్వో ద్వారా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి చేరడంతో విడతల్లో భూములు పంపిణీ జరిగిన కొన్ని పేజీలు తొలగించి నిజమైన లబ్దిదారుల పేర్లు అలాగే ఉంచి వీరు స్వయంగా రాసుకున్న పేజీలు అందులో అతికించి మళ్లీ రెవెన్యూ కార్యాలయానికి చేర్చడం జరిగిందని గతంలో ఆరోపణలు వచ్చాయి. ఆడి రిజిస్టర్ కూడా ఒక మాజీ ఎంపీపీ స్వస్థలతో పేర్లు నమోదు చేసినట్లు ఆ చేతిరాతను సరి చూసుకుంటే విషయం మరింత స్పష్టమవుతుందంటూ నోటీసులు జారీ చేసిన అనంతరం స్థానికంగా చర్చలు వెలుగులోకి వచ్చాయి. ఒకే సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు సీతారామపురం మండలానికి చెందిన కొంత మంది పేర్లపై పది నుంచి 15 ఎకరాలు అలాగే వారి కుటుంబ సభ్యుల పేర్లు ఒక 20 నుంచి 30 ఎకరాలు ఇలా ప్రభుత్వ నిబంధనలు కూడా తెలియకుండా అక్రమంగా నమోదు చేసుకోవడం సంచలనంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు ఎకరాలకు మించి భూ పంపిణీలో పంపిణీ జరగకూడదు. విడతల్లో కాకుండా మామూలుగా భూమి ఇవ్వకూడదు కానీ విడతల్లోనే వీరికి పది నుంచి 20 ఎకరాలు ఇస్తున్నట్లుగా ఒకే కుటుంబానికి 50 నుంచి 6 ఎకరాలు నమోదు చేసుకోవడం విశేషంగా మారింది. ఈ క్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించి అక్రమార్కుల నోటీసులు అందజేయడం స్థానికంగా సంచలనం రేపింది. అసలు రెవెన్యూ కార్యాలయంలో డి రిజిస్టర్లు భద్రంగా ఉన్నాయా..! తారు మారు అయ్యాయా అనే అనుమానం మండల ప్రజలకు మరింత బలపడింది. ఒక కొండాయపాలెం పంచాయతీ మాత్రమే కాకుండా మిగిలిన రెవెన్యూ పంచాయతీల్లో కూడా సాధించాలని పాత రికార్డులు సైతం అందుబాటులో లేకుండా చేయటం పట్ల అంటే అక్రమాలు చోటు చేసుకోవడం కోసమేనా అంటూ పలువురు అంటున్నారు. రెవెన్యూ శాఖ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా జిల్లా ఉన్నతాధికారులు కూడా ప్రత్యేక దృష్టి సారించి ఉదయగిరి మండలం అంతా కూడా సవ్యంగా ఉందా లేదా అన్న విషయంపై వివరాలు సేకరించాలని తహసీల్దార్ కార్యాలయంలో భద్రంగా ఉండాల్సిన రిజిస్టర్లు ఉన్నాయా లేదా అనే విషయం కూడా పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

## పనులు వేగవంతం కావాలి



**కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సబ్ ట్రెజరీ నిర్మాణ పనులు మరింత వేగవంతం కావాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన సబ్ ట్రెజరీ నూతన భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే పనులు నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ట్రెజరీకి సంబంధించి పలు విషయాలపై సబ్ ట్రెజరీ అధికారి కిరణ్‌కుమార్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీవో కార్యాలయ ఉద్యోగి మధుసూదన్‌రావు, తదితరులు ఉన్నారు.

## 12న పిల్లల తల్లిదండ్రులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో స్వాగతం పలకాలి



**ఉదయగిరి, జూన్ 10, ప్రభాతవార్త** : ఉదయగిరి మండల పరిధిలోని ప్రాథమిక , ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పండుగ వాతావరణంలో పాఠశాలలు తెరిచి విద్యార్థులు తల్లిదండ్రులు ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వాగతం పలకాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు కల్పన, తాగునీరు, విద్యుత్ సరఫరా ఉండేలా ఉపాధ్యాయులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్తగా చేరే విద్యార్థులు యు డైస్‌లో నమోదు చేయాలన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోండి



**బిట్రగుంట జూన్ 10 ప్రభాతవార్త** : కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బోగోలు మండల వైఎస్సార్సీపీ తరపున స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పఠ్రి అంకులయ్య,గోపిశెట్టి వెంకయ్య,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏ.కళ్యాణ్ కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మేకల సాల్మన్ రాజు,మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ నవాజ్, మండల యువత అధ్యక్షులు రమేష్ రెడ్డి, బోగోలు పంచాయితీ ప్రధాన కార్యదర్శి తోటపల్లి సాగర్, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సూరపనేని శ్రీనివాసులు,ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పూతల ప్రసాద్,రాజశేఖర్ బర్నర్ పాపన మల్లారెడ్డి,మిట్టా పిచ్చయ్య,బంక రాజన్న,బంక కమల్ వినుకోటి మల్లికార్జున,ఎఫ్.ఎ రాజు, గంగ పట్ల పాపయ్య, మోహన్ రావు,నకుల్ రెడ్డి, రాపూర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఏ కిరణ్ కుమార్,మండల పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు వరుణ్ తేజ, పులి వెంకటేశ్వర్లు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారుల భవితపై అంగన్‌వాడీలకు శిక్షణ



**జలదంకి, జూన్10, ప్రభాతవార్తః** చిన్నారుల ఆరోగ్యపరిరక్షణకై స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం అంగన్‌వాడలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జలదంకి ప్రాదమిక ఆరోగ్యకేంద్ర వైద్యాదికారి శ్రీనివాసులు పాల్గొని నవచేతన,పిల్లల భవిత అన్న అంశాలపై కూలంకుషంగ వివరించారు.సున్నానుంచి ఆరేళ్ళ పిల్లల పట్ల తల్లి,దండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితరాలను విశదీకరించాడు.పైసూచించిన కాలం వారికి అత్యంత కీలకదశని ఆఫిరిడ్‌లో జాగురూకతతో మెలగాల్సి వుందని చెప్పారు.ఈదశలో పిల్లల్ని శాస్త్రీయంగ పరిశీలిస్తు ఏమైన లోపాలుంటే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చాడు.పిల్లల్లో కనిపించే లోపాలను నాలుగు డీల ఆదారంగ స్క్రీనింగ్ నిర్వహణ,అవసరమైన సందర్భంలో వైద్య సేవలకు రెఫర్ చేసే విదానాలపై అవగాహన కల్పించాడు. ఈ కార్యక్రమంలో ఎసిడిపొ శర్మిష్ట,మండలంలోని జలదకి, ట్టుపల్లి, బ్రాహ్మణక్రాక అంగన్‌వాడి సూపర్‌వైజర్లు సుహాసిని,విజయ లక్ష్మి,షకీల,సిహెచ్.ఓ సోమేశ్వరరావు,అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పాలిట శివపార్వతులు : వేమిరెడ్డి దంపతులు



**కొడవలూరు, జూన్ 10 ప్రభాతవార్త:** కోవూరు నియోజకవర్గ ప్రజల పాలిట నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శివపార్వతుల్లా నిలిచారని టీడీపీ మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు అన్నారు. గతంలో కోవూరు పరిస్థితి ఎలా ఉండేదో నేడు ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుంటున్నారని,ప్రస్తుతం అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గం పురోగతి పథంలో సాగుతోందన్నారు.

## గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



**కావలి,జూన్ 10 ప్రభాతవార్త** : గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని కావలి ఏరియా వైద్యశాల ఇన్‌చార్జ్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ హరిత, ఆర్ఎంఓ డాక్టర్ ప్రమీలలు తెలిపారు. స్థానిక ఏరియా వైద్యశాల కాన్పుల విభాగంలో పిఎం సురక్షిత అభియాన్ కార్యక్రమం రెండవ రోజు బుధవారం గర్భిణీలకు వైద్యపరీక్షలు నిర్వహించి స్కానింగ్ చేసి మందులు, మజ్జిగ ప్యాకెట్లును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భకోశవ్యాధి వైద్యనిపుణులు డాక్టర్ వెంకటలక్ష్మి డాక్టర్ మాధవిలత, నర్సింగ్ సూపరిండెంట్, హెడ్‌నర్సులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కావలి విష్ణుఆలయం హుండి లెక్కింపు



**కావలి, జూన్ 10 ప్రభాతవార్త :** పట్టణంలోని విష్ణుఆలయం హుండి లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపు కార్యక్రమం ఈఓ అరవ రాధాక్రిష్ణ, కోవూరు ఇన్స్‌పెక్టర్ బి.నాగమల్లేశ్వరరాజుల సమక్షంలో బుధవారం హుండి లెక్కింపు నిర్వహించారు. 2025నుంచి జూన్ 2026జూన్ వరకు లెక్కించగా 2,89,165 రుపాయలు వచ్చినట్లు ఈఓ తెలిపారు.

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో పార్టీని

# మరింత బలోపేతం చేస్తాం : బుచ్చి టిడిపినాయకులు



**బుచ్చి జూన్ 10 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనతో వర్కింగ్ ప్రెసిడెంట్ నారాలోకేష్ వినూత్న ఆలోచనలతో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనలతో పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలుగుదేశం పార్టీ అర్బన్ నాయకులు తీర్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీని బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన నాయకులు,కార్యకర్తల తొలి సమావేశం బుచ్చిరెడ్డిపాళెం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. నెలలో ప్రతి బుధవారం క్లష్టర్ లెవల్ సమావేశం,2 వ బుధవారం మండల స్థాయి నాయకులు,కార్యకర్తలసమావేశం, 3వ బుధవారం ఎమ్మెల్యే స్థాయిలో నాయకులు ,కార్య కర్తల సమావేశం,4 వ బుధవారం జిల్లా మంత్రులతో సమస్యల సాధనకోసం సమావేశం ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించిన కార్యక్రమం బుధవారం టిడిపి నాయకులు,కార్యకర్తలు బుచ్చిలో ప్రారంబించా రు. ఈ సందర్బంగా నాయకులు టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు మాట్లాడుతు కూటమి ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలలోకి తీసుకొని వెళ్లి ప్రజలలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూ చించారు. అనంతరం క్లష్టర్ ఇంచార్జి విజంఠ రామా నాయుడు మాట్లాడుతు మున్సిపాల్టీలో పలు అభి వృద్ది కార్యాక్రమాలు జరగాల్సి వుందని వాటన్నిం టిని మున్సిపల్ పరిధిలో జరిగేవి మున్సిపాల్టీలో, ఆపైన జరిగేవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించుకోవాలని తద్వారా ప్రజలకు మనం చేసిన పనులు చెప్పి స్దానిక సంస్దల ఎన్నికలలో ముందుకు పోవచ్చునని అన్నారు.ఈకార్యక్రమంలో పార్టీ మెంటరీ ఉపాధ్యాక్షులు ఎంవిశేషయ్య , జిల్లా రైతు విభాగం అధ్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి పార్టీ గౌరవాధ్యక్షులు టంగుటూరు మల్లికార్జు నరెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళీ, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, క్లష్టర్ ఇంచార్జి ఇప్పగుంట సుధాకర్‌రెడ్డి, దొడ్ల కోదండరామిరెడ్డి మైనార్టీ నాయకులు షేక్,షబ్బీర్,షేక్ ఫర్వీన్,దుగ్గిశెట్టి హరినాద్,కౌన్సిలర్లు బెల్లం మల్లారెడ్డి, రాచూరు సత్యనారాయణ, మైనార్టీనాయకులు సుభానీ తాళ్ళ వైష్ణవి,తాళ్ళ నరసింహస్వామి, వల్లూరు శ్రీనివాసులు,దశరద్ పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## బీదాను అభినందించిన పుట్టా



**బుచ్చి జూన్ 10 ప్రభాతవార్త** రాజ్యసభ సభ్యులు బీదమస్తాన్‌రావుకి డాక్టరేట్ పురస్కారం లభించడం ఎంతో ఆనందదాయకం అని జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు అభినందించారు. మన రాష్ట్ర గవర్నర్ చేతుల మీదు గా ఈ గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించడం వారి సేవలకు దక్కిన విశిష్ట గుర్తింపు అని అన్నారు.ఈ సందర్బంగా బీదామస్తాన్‌రావుకి శాలువాల ఘనంగా స్కరించి పూల బొక్కేఅందజేశారు.ఆయన భవిష్యత్తులో మరెన్నో ఉన్నతశిఖరాలు అదిరోహించాలని కాంక్షిం చారు.బీదాసోదరులతో అనేక సంవత్సరాలనుండి తమ కుటుంబానికి ఎంతో అనుబంధం వుందని పుట్టా గుర్తు చేసుకున్నారు.

## రీసర్వే తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### - రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కుర్మనాధ్

### - రీసర్వే ఆకస్మిక తనిఖీలో సూచనలు చేస్తున్న కూర్మనాథ్



**బిట్రగుంట జూన్ 10 ప్రభాతవార్త** భూముల్లో నిర్వహిస్తున్న రీసర్వేల్లో రైతులను భాగస్వాములను చేసేలా ముందుగానే సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, ఈకేవైసీతప్పనిసరిగా నమోదు చేయాలని రాష్ట్ర డైరెక్టర్ (సర్వే, సెటిల్మెంట్ అండ్ లాండ్ రికార్డ్స్) రోణంకి కూర్మనాథ్ అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు గ్రామం, దగదర్తి మండలం మనుబోలుపడు గ్రామాలకు సంబందించి బోగోలు, దగదర్తి మండలల తహసీల్దార్ల కార్యాలయలలో జరుగుతున్నా రీ సర్వే విలేజ్ సర్వేయర్ లాగిన్, విలేజ్ రెవెన్యూ అధికారి లాగిన్‌లను బుధవారం ఆయన జిల్లా రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రీసర్వే పనులు తప్పులుగా జరుగుతున్నాయని ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయి పరిశీలనకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు ఇచ్చిన నోటీసులను పరిశీలించిన ఆయన 72 గంటల ముందు రైతులకు సమాచారమివ్వాలని తెలియచేసారు. సర్వే మొదలు పెట్టేరోజున తప్పనిసరిగా సంబంధిత రైతు లేదా కుటుంబ సభ్యులు క్షేత్ర స్థాయిలో ఉండాలని, సర్వే పూర్తయిన తరువాత డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా సరిహద్దుల నిర్ణయం రైతు సమక్షంలోనే నిర్వహించాలన్నారు. రైతు చేతికి సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందజేసే వరకూ సమాచారం తప్పనిసరిగా అందించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీసర్వే 1.0 లో భూ సరిహద్దుల నిర్ణయం, భూ వివరాలు తప్పులుగా నమోదవడంతో పాటు జాయింట్ ఎల్పీ నంబర్లు లాంటి చాలా ఇబ్బందులను రైతులు ఎదుర్కొన్నార న్నారు. భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించే విధంగా రీ సర్వే 2.0 నిర్వహిస్తున్నామన్నారు. రీ సర్వే నిర్వహించిన తరువాత నోటీసు రూపంలో రైతు చూపించిన హద్దుల ప్రకారం భూ వివరాలను తెలియజేయడం, డాక్యుమెంట్లతో సరిపోల్చుకుని నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ఈకేవైసీ చేయించడం ద్వారా రైతు సమక్షంలో సర్వే నిర్వహించడంతో పాటు రైతులకు అన్ని విధాలా సమాచారం అందిస్తూ ఎక్కడా రైతులు ఇబ్బంది పడకుండా చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వ హిస్తున్న రీసర్వేల్లో ఫేజ్1లో 628, ఫేజ్2లో 748, ఫేజ్3 లో 729, ఫేజ్4 లో 1645, ఫేజ్5 లో 1343 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 2, 800 టీమ్స్‌తో అత్యాధునిక రోవర్స్ తో సర్వే నిర్వహించడం జరుగుతున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో భూవివరాలు, డాక్యుమెంట్ పరంగా గల వివరాలను రైతుల సమక్షంలోనే సరిపోల్చుతూ ఇకముందు ఎటువంటి భూవివాదాలకు తావులేకుండా రైతు సంతృప్తి చెందేవిధంగా రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే డిడి నాగేశ్వర్,ఏడి కృష్ణకుమార్, బోగోలు, దగదర్తి మండలాల తహసీల్దార్లు ఇతర రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్‌నాథ్ సింగ్ కలిసిన బొల్లినేని



**వింజమూరు, జూన్ 10, ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రసహకారం అవసరమని, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బొల్లినేని కోరినట్లు తెలిసింది. ఈ భేటీ సుమారు అరగంట పాటు సాగింది.

## నాకు దేవుడిచ్చిన గిఫ్ట్ బాలకృష్ణ : నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి




**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త – వైద్యం** NTR భవన్‌లో కోటంరెడ్డి ఆధ్వర్యంలో దద్దరిల్లిన బాలకృష్ణ జన్మదిన వేడుకలు ముఖ్యఅతిధు లుగా హాజరైన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి,కోటంరెడ్డిశ్రీధర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్,చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి భారీగా వచ్చి న బాలకృష్ణ అభిమానులు, టీడీపీనేతలు.. కిక్కిరిసిన NTR భవన్‌పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులు నందమూరి బాల కృష్ణ అభిమానాన్ని, నమ్మకాన్ని పొందటం తన అదృష్టమని నుడా చైర్మన్ కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు.. ఆయన వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని వెల్లడించారు. నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలతో NTR భవన్ దద్దరిల్లింది. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు.. పలు చోట సేవా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు..బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నేతలతో NTR భవన్ కిక్కిరిసింది. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడారు. ఒకప్పుడు బాలకృష్ణతో ఫో టోతీసుకోవాలవాలనే ఆశఉండేదనీ.. దేవుడు దయవల్ల ఇప్పుడు ఆయన కుటుంబ సభ్యుడిగా మారిపోయా నన్ని వెల్లడించారు. ఆయన చేతులు మీదుగా తన కొడుకు పెళ్లి జరిగిందని గుర్తు చేసుకున్నారు. బాలకృష్ణ మనస్తత్వం ఎవ్వరికీ ఉండదని.. నమ్ముకున్న వారికోసం ఎంత దూరమైనా వెళ్ళే నైజం ఆయనకే సొంతం అన్నారు.. తాను కూడా ఆయన బాటలో ప్రయాణం సాగిస్తున్నట్లు వివరించారు. గొంతులో ప్రాణం ఉన్నం త వరకు నమ్ముకున్న వారికి అండగా ఉంటానన్నారు. ఇక్కడ నుంచి రాజకీయాలు చేస్తాననీ.. పార్టీ కోసం చివరి శ్వాస వరకు పోరాటం చేస్తుంటా అని వెల్లడించారు.. వైసీపీ హయంలో నన్ను చంపాలని చూశా రనీ.. తన కొడుకే బతికించాడని అన్నారు. శ్రమ, కష్టపడే తత్వం ఉన్నప్పటికీ.. విధి రాత సరిగా లేకపోవడంతోనే ఎమ్మెల్యే అవ్వలేక పోయానని తన మనసులోని భావాలను అందరితో పంచుకున్నారు. టీడీపీకి రాబోయే జనరేషన్ స్ట్రాంగ్‌గా ఉందని.. కోటంరెడ్డి కుమారుడు ప్రజయ్ సేనా రెడ్డి చాలా చక్కగా మాట్లాడుతున్నారని ..సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు .బసవ తారకం ద్వారా ఎంతో మందికి పునర్ జన్మ ప్రసాదించిన గొప్ప వ్యక్తి బాలకృష్ణ అని ఆయన కొనియాడారు.ఇప్పుడు ఉన్న చాలా మంది ఎమ్మెల్యేలు మంత్రులు గతంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అనుచరులే అని ..రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి..అన్నారు. విద్యార్థి రాజకీయాలలో ఆయన ఎంతోమందికి రాజకీయ పాఠాలు నేర్పారని గుర్తు చేశారు. తన లాగే కోటంరెడ్డి ఇప్పటికే రెండు, మూడు సార్లు ఎమ్మెల్యే అవ్వాల్సిందని.. దురదృష్టం అది జరగలేదన్నారు.. వచ్చే ఎన్నికల్లో కోటంరెడ్డి కచ్చితంగా ఎమ్మెల్యేగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.. ఎన్ని కష్టలొచ్చినా.. పదవి ఉన్నా లేకున్నా ఎప్పుడూ బాలకృష్ణకు అభిమానిగా ఉన్న నాయ కులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అని ..వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్.. అన్నారు.. గొప్ప నటులుగా మాత్రమే కాకుండా.. క్యాన్సర్ బారిన పడిన వారిని కాపాడే గొప్ప మనసున్న వ్యక్తి బాలకృష్ణ అని ఆయన కొనియాడారు.. లక్షల కుటుంబాలలో వెలుగులు నింపి తండ్రికి తగ్గ తనయుడిగా బాలయ్య పేరు గడిం చారని అన్నారు. రాష్ట్రంలో ఉండే ప్రతి యువతకు బాలకృష్ణ ముద్దుల మావయ్య అని వెల్లడించారు.. వైసీపీ హయంలో పార్టీ కోసం కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు.. సినీ, రాజకీ య రంగంలో బాలకృష్ణ తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని ..జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంక టేశ్వర్లు రెడ్డి.. అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ నియోజకవర్గ టీడీపీ నేతలు, బాలకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## డిమాండ్ల సాధనకై ఉద్యమ బాట

### - సిద్ధంగా ఉండాలన్న ఏపీ జేపీసీ అమరావతి జిల్లా శాఖ



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త – కలెక్టరేట్** న్యాయమైన డిమాండ్ల సాధనకై ఉద్యమ బాట పట్టేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు సిద్ధం కావాలని ఏపీ జేపీసీ అమరావతి నెల్లూరు జిల్లా శాఖ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఏపీ జేపీసీ అమరావతి జిల్లా శాఖ అధ్యక్షులు అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరూ ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. 12వ పీఆర్సీ కమిషనర్ నియామకం, ఐఆర్ విడుదల, బకాయిల చెల్లింపు, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, రిటైర్డ్ ఉద్యోగులకు తగ్గించిన క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ, 5 రోజుల పని దినాలు వంటి డిమాండ్ల సాధించుకోవలసిన అవసరం ఉద్యోగులకు ఉందన్నారు. ఆకాశాన్ని అంటిన ధరలుతో ఆర్థిక సంక్షోభముతో ఉద్యోగుల కుటుంబాలు జీవిస్తున్నా, గడువు దాటి మూడు సంవత్సరాలైనా పిఆర్సి కమిషనర్‌ని నియమించక పోవడం..మధ్యంతర భృతి ప్రకటించకపోవడం పట్ల నాయకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. 1.7.2023 నుండి పొందాల్సిన 12వ పిఆర్సి ప్రయోజనాలు కోసం గత ప్రభుత్వం 12.7.2023న 12వ పీఆర్సీకి కమిషనర్‌గా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఐఎస్‌ని నియమించగా, ఆయన కూటమి ప్రభుత్వం రాగానే తేదీ 21.6.2024న తన పదవికి రాజీనామా చేశారన్న జిల్లాశాఖ ప్రతినిధులు ప్రభుత్వానికి ఏ విధమైన ఆర్థిక భారం లేనప్పటికీ గడచిన రెండు సంవత్సరాలుగా 12వ పిఆర్సి కమిషనర్‌ని ఈ కూటమి ప్రభుత్వం నియమించకపోవడం శోచనీయమన్నారు. ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలిసి ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి ఉద్యోగులకు 1.10.2023 నుండి 5 శాతం మధ్యంతర భృతి (ఐ.ఆర్) చెల్లిస్తున్నప్పటికీ, కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదన్న వారు తద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఈ మూడు సంవత్సరాలుగా లక్షల రూపాయల ఆర్థిక ప్రయోజనాలు కోల్పోయి, తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పే రివిజన్ ఇప్పటికే తీవ్రంగా ఆలస్యమైన పీఆర్సీ కమిషనర్ ను నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలని, కూటమి ప్రభుత్వము మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి గతంలో చెల్లిస్తున్న అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ ను పెంచాలని, 01.07.2018 నుండి తేది. 01.01.2024 వరకు చెల్లించవల్సిన డిఏ బకాయిలు వెంటనే చెల్లించాలని, 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుండి నేటి వరకు రావలసిన నాలుగు డి.ఏలు తక్షణమే మంజూరు చేయాలని, ప్రతి సీనియర్ ఉద్యోగి సంవత్సరానికి రెండు నుంచి మూడు నెలల జీతాన్ని ఇన్కమ్ టాక్స్ రూపంలో కోల్పోతున్నందున, కనీసం సంవత్సరానికి 15 రోజులు ఇచ్చే సరెండర్ లీవులని నాలుగు సంవత్సరాలుగా చెల్లించనందున, వెంటనే ఉద్యోగుల సరెండర్ లీవ్లను ఎప్పటికప్పుడు చెల్లించాలని, ఉద్యోగుల హెల్త్ కార్డుని సమగ్రంగా అమలు చేయడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, మార్కెట్లో వినియోగ వస్తువుల ధరలు వేగంగా పెరుగుతున్న దృష్ట్యా ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు అన్నియు ప్రతి ఉద్యోగి పే స్లిప్‌లో కనిపించేలా తగు చర్యలు తీసుకోవాలని, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం ప్రభావం వలన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే పొదుపు చర్యలు చేపట్టినందున, రాష్ట్రం లో ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని లేని పక్షంలో రెండవ శనివారం కాకుండా నెలలో ఉన్న మిగిలిన శనివారాలు వర్క్ ఫ్రం హోం నకు అవకాశం కల్పించాలని, పొదుపు చర్యల్లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ వాహనాలు కొనుగోలునకు ప్రోత్సాహకాలు అందిస్తున్నందున, మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగులకు ఎలక్ట్రికల్ వాహనాలు నిమిత్తము ప్రత్యేకమైన ప్రోత్సహకాలు అందించాలన్నారు. ప్రభుత్వం మొండి వైఖరితో ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లపై స్పందించకపోతే, కోల్పోతున్న ప్రయోజనాల కోసం ఏపీ జేపీసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ఉద్యోగులు ఐక్యతతో పోరాటానికి సంసిద్ధంగా ఉండాలని జిల్లా శాఖ ప్రతినిధులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కాగా ఈ సమావేశంలో ఏపీ జేపీసీ అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డితో పాటు జిల్లా జనరల్ సెక్రెటరీ ఓవి ప్రసాద్, జిల్లా మహిళా చైర్మన్ వసంతకుమారి, మహిళా జనరల్ సెక్రెటరీ చెన్నమ్మ, వెటర్నరీ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా చైర్మన్ మరియు ఏపీ జేపీసీ అమరావతి కో చైర్మన్ డాక్టర్ జానా చైతన్య కిషోర్, ఏపీపీటీడీ జిల్లా నాయకులు మోహబుల్లా, శరత్ బాబు, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, తెలుగు పండిట్ ఉపాధ్యాయ అసోసియేషన్ అధ్యక్షులు, ఏపీజే అమరావతి కోచైర్మన్ మునీంద్ర, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లానాయకులు జి సతీష్‌లు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతకు ఎస్ఈఐఎల్ ఎనర్జీ బాసట

### - పోలీసు శాఖకు అత్యాధునిక డ్రోన్లు, పెట్రోలింగ్ వాహనాల అందజేత





**నెల్లూరు క్రైం, జూన్ 10, ప్రభాతవార్త:** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో పోలీసు శాఖను మరింత బలోపేతం చేసేందుకు ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చింది. తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా, పోలీసు శాఖకు ఆరు అధునాతన సర్వైలెన్స్ డ్రోన్లను, రెండు మహీంద్రా బొలెరో నియో పెట్రోలింగ్ వాహనాలను ఆ సంస్థ అందజేసింది. నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగాపాల్గొన్నారు.ఎస్ఈఐఎల్ ఎనర్జీ సీఈఓ జన్మజయ మహాపాత్ర ఈ పరికరాలను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) సౌజన్యకు అందజేశారు. ఈ సందర్భంగా ప్లాంట్ సెక్యూరిటీ హెడ్ సురేష్ కిరణ్ మాట్లాడుతూ డ్రోన్ల పనితీరును వివరించారు. ఇవి 250 మీటర్ల ఎత్తులో ప్రయాణిస్తూ, 5 కి.మీ పరిధిని నిరంతరం పర్యవేక్షించగలవని, ఒక్కో డ్రోన్ 45 నిమిషాల పాటు పనిచేస్తుందని, ప్రతి డ్రోన్‌కు అదనంగా నాలుగు బ్యాటరీలు ఉండటంతో, మొత్తం మూడు గంటల పాటు నిరంతరాయంగా ఆపరేషన్లు నిర్వహించవచ్చన్నారు. అత్యవసర సమయాల్లో కానీ సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు కానీ, డ్రోన్లు స్వయంచాలకంగా తిరిగి ఆపరేటింగ్ పాయింట్‌కు చేరుకునే ఖీఆటో రిటర్న్ టు హోమ్‌ఖి ఫీచర్ ఇందులో ప్రత్యేకత అని వివరించారు.శాంతి భద్రతలకు భరోసా ప్రజల భద్రతను మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో అందజేసిన ఈ రెండు పెట్రోలింగ్ వాహనాలు మరియు డ్రోన్లు,నేరాల నియంత్రణలో పోలీసులకు ఎంతగానో తోడ్పడతాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెయిల్ ప్లాంట్ ఈఏ హెడ్ బ్రిగేడియర్ రఘురాం (రిటైర్డ్), కృష్ణపట్నం పోర్ట్ సీఐ రఘు బాబు, ఆర్ఐ అడ్మిన్ హరి బాబుతో పాటు గూడూరు, పోర్ట్, ముత్తుకూరు, వి.సత్రం, మనుబోలు, పొదలకూరు సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంచార్జ్ మంత్రికి స్వాగతం పలికిన అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త – వైద్యం** డిఆర్సి మీటింగ్‌కు విచ్చేసిన నెల్లూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాశ్యం మహమ్మద్ ఫరూక్‌కు నగరంలోని ఆర్‌ఎండ్ బీ అతిథి గృహంలో స్వాగతం పలికిన ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ స్వాగతం పలికారు.

## బీహార్ బస్సు ప్రమాదంలో మరో ప్రాణం బలి

**సంగం జూన్ 10 ప్రభాతవార్త** బీహార్‌లో ఆంధ్ర యాత్ర బస్సుకు జరిగిన ఘోర ప్రమాదంలో మరో ప్రాణం అనంతవాయువులలో కలిసి పోయింది. ఐసియులో చికిత్స పొందుతున్న సంగంకు చెందిన బొమ్మిశెట్టి లక్ష్మమ్మ మృతి చెందింది.ఈ సంఘటనతో సంగంలో మరింత విషాద ఛాయలు అలముకున్నాయి. లక్ష్మమ్మ మృతితో కేవలం సంగంలోనే ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఆత్మకూరుతో కలిపితే మొత్తం నలుగురు మృత్యువాత పడ్డారు.

## రవాణాశాఖ,పోలీస్‌శాఖ సంయుక్త తనిఖీలు





**సంగం జూన్ 10 ప్రభాతవార్త** సంగంలో రవాణా శాఖ,పోలీస్‌శాఖ సంయుక్తంగా ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీలు నిర్వహించారు. ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ రాములు బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు స్కూల్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి అని అన్నారు. బస్సుల్లో ఎమర్జెన్సీ డోర్‌వద్ద ఎలాంటి అడ్డంకులు ఉండరాదని సూచించారు.. ప్రతిస్కూల్ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, 2 ఫైర్ సిలిండర్లు తప్పనిసరి అని తెలిపారు. పరిమితికి మించి విద్యార్దులను ఎక్కించకూడదని హెచ్చరించారు. ఓవర్‌లోడ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలు ఇళ్ళవద్ద దింపి అటెండర్ రైట్‌చెప్పాకే బస్సు కదలాలని అన్నారు. కల్వర్టులపైన నీరు ప్రవ హిస్తుంటే సాహసాలు చేయవద్దని వాహనాలను నిలిపివేయాలని అన్నారు. వర్షాల సమయంలో పిల్లల భద్రతపై స్కూల్ యజమానులు అలసత్వంవహించరాదని అన్నారు.సెల్‌ఫోన్ డ్రైవింగ్,మద్యంసేవించి నిడిపితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నిబందనలు ఉల్లంఘిండే డ్రైవర్లు ,ఫిటెనెస్ లేని బస్సులపై కఠిన చర్యలుతప్పవని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట రవాణాసిబ్బంది,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

### - గూడూరు ఆర్డీవో అరుణకుమారి



**గూడూరు, జూన్ 10, ప్రభాతవార్త** ప్రతి ఒక్కరు బాలికల సంరక్షణకు కృషి చేయాలని గూడూరు ఆర్డీవో అరుణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బేటి బచావో బేటి పడావో డివిజనల్ లెవెల్ సెన్సిటైజేషన్ ప్రోగ్రాం జువైనల్, పోక్సో యాక్ట్‌పై అవగాహన సముచిత స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఆర్డీవో అరుణకుమారి పాల్గొన్నారు. గూడూరు ఆర్డీవో అరుణకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, బాలిక విద్య ప్రాముఖ్యత గురించి బాలల హక్కుల గురించి, పౌష్టికాహారం గురించి వివ రించారు. పిల్లలు బాగా అభివృద్ధి చెందాలంటే కుటుంబంలో పరిస్థితులన్నీ అనుకూలంగా ఉండాలని ఆడ పిల్లని మగపిల్లలతో సమా నంగా పెంచాలని పేర్కొన్నారు. ఆడపిల్లలను చిన్న వయసులోని వివాహం చేయ కుండా ఉన్నత చదువులు చదివించాలని తెలిపారు. బాలల సంరక్షణ అధికారి బి సురేష్ మాట్లాడుతూ బాలల చట్టాలు, బాలల హక్కుల గురించి బాలలపై జరిగే లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి బాలల హెల్ప్ లైన్ 1098 గురించి అందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ మాట్లాడుతూ అబ్బా యికి 21 సంవత్సరాలు నిండాలని అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేస్తే చట్ట బద్ధత ఉంటుందని తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపివో మెహబూబీ, రూరల్ ఎస్ఐ తిరుపతయ్య, అంగన్వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## దగదర్తి మిక్స్‌డ్ కాలనీలో తాగునీటి కష్టాలు

### - పది రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు అవస్థలు



**దగదర్తి,జూన్ 10, ప్రభాతవార్త** మండల కేంద్రమైన దగదర్తి గ్రామంలోని మిక్స్‌డ్ కాలనీలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. కాలనీలో నివాసముంటున్న సుమారు 250 కుటుంబాలు నీటి సరఫరా అందక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న మూడు బోర్లలో ఒక బోరు కొన్ని నెలల క్రితమే మోటారు పని చేయడం ఆగిపోయిందని ఉన్న రెండు బోర్లు మీద వారికి నీళ్లు అందిస్తూ వచ్చారని, నెల క్రితం రెండో బోరు పని చేయటం ఆగిందని దాని కారణంగా కాలనీలోని సగం మందికి నీటి సరఫరాలేక నెల నుంచి ఇబ్బందులు పడుతున్నామని ఎన్ని సార్లుఅధికారులు దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని ఉన్న మూడో బోరు నీటి మట్టం అడుగంటడంతో గత పది రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు అందక రోజువారీ అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు సరైన చర్యలు చేపట్టలేదని వారు ఆరోపించారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీరు అందించాలని కోరారు. మండలంలో గతవారం రోజులుగా మూడు లైన్ల విద్యుత్ సరఫరా అంతరాయంతో సక్రమంగా తాగునీరు అందడం లేదు.ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవీంద్రనాథ్‌ను సంప్రదించగా మిక్స్ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అత్యవసరంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కాలనీ వాసులకు తాగునీరు అందిస్తామన్నారు. మూడు లైన్ల విద్యుత్ సరఫరా అంతరాయం కారణంగా గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా అందడం లేదని వాస్తవమేనని ఆయన తెలిపారు.

## షాదీ మంజిల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

### - ఇన్‌చార్జి మంత్రిని కోరిన కోవూరు ఎమ్మెల్యే





**కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త :** జిల్లా రివ్యూ కమిటీ సమావేశానికి బుధవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర, న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతంపలికారు.ఈ సంద ర్భంగా ఆమె కోవూరు నియోజకవర్గ పరిధిలోని దామరమడుగులో షాదీమంజిల్ నిర్మాణానికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. దామరమ డుగు పరిధిలోని హజరత్ మలంగషావలి దర్గా కమిటీ స్థానిక ముస్లిం మైనార్టీ సోదరులు ఇటీవల ఎమ్మెల్యేను కలిసి షాదీ మంజిల్ లేక ఎదుర్కొం టున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ముస్లిం మైనార్టీల విజ్ఞప్తిని సాను కూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పంచా యతీ విభాగం ద్వారా 40 లక్షల అంచనాలతో నివేదిక సిద్ధం చేయించారు. నిరుపేద ముస్లిం కుటుం బాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఆమె కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై కూడా మంత్రితో చర్చించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## బూత్ స్థాయి సిబ్బంది ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలి



**కోవూరు, జూన్ 10 ప్రభాతవార్త :** స్పెషల్ ఇంటె న్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటరు వివరాలను జాబితాతో సరిపోల్చి చూడాల్సిన అవసరం ఉందని ఈ మేరకు జిల్లా నుంచి డీఆర్వో విజయకుమార్ బుధవారం ఎన్నికల కమిషన్‌ఆదేశాల మేరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహించారు. మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ఓటరులిస్టులో ఉండే తప్పులుసరి చేయడం, చనిపోయిన వారి పేర్లు తొలగించడం, శాశ్వతంగా మైగ్రేట్ అయినవారి పేర్లు తీసివేయడం, కొత్తగా 18ఏళ్లు నిండిన వారి పేర్లనుచేర్చడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఓటరు లిస్టులో అడ్రస్ తప్పు ఉన్నా, వయస్సు, ఫొటో సక్రమంగా లేకపోయినా దానిని కూడా సరిచేయడం ద్వారా పూర్తిస్థాయిలో అప్‌డేట్ చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అర్హులైనప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్చడమే అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ శిక్షణాతరగతుల్లో ఏఈఆర్‌వో,తహ సీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఏఎస్‌వో రామ్మోహన్, డిప్యూటీ తహసీల్దార్లు బషీర్,ఎలక్షన్‌డిప్యూటీ తహసీల్దార్ సురేష్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, సూపర్ వైజర్లు, బీఎల్‌వోలు ఉన్నారు.

## మత్స్యకారులకు సాయం తక్షణమే అందించాలి: ఎమ్మెల్యే



**నెల్లూరు, జూన్ 10, ప్రభాతవార్త– కలెక్టరేట్** నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈసమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సేవా పథకం కింద అక్టోబర్15లోపు రిజిస్ట్రేషన్ చేయించుకున్న అర్హులైనలబ్దిదారుల్లో కొంతమందికి వివిధ సాంకేతిక,కారణాల వల్ల ఆర్తికసాయం జమకాలేదని వివరించారు. ప్రత్యేకంగా కావలి నియోజకవర్గంతో పాటు జిల్లాలో దాదాపు 450మంది మత్స్యకారులకు పథకం కింద అందాల్సిన ఆర్థికసాయం ఇప్పటికివారి ఖాతాల్లో జమ కాలేదని పేర్కొన్నారు.జీవనోపాది కోసం సముద్రం పైనే ఆధారపడి ఉన్నామని తెలిపారు.ఈ సాయం ఎంతో కీలకమని, ఆలస్యంకావడం వల్ల ఇబ్బందులు మరింత పెరిగేఆవకాశం ఉందన్నారు.అర్హతఉన్న ప్రతి మత్స్యకారుడు సాయానికిదూరం కాకూడదని స్పష్టంచేశారు. పెండింగ్‌లోనిధరఖాస్తులను అధికారులు వెంటనే పరిశీలించి సమస్యలను పరిష్కరించాలనికోరారు. సంబందిత శాఖలఅధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి కార్మికునికి న్యాయం జరిగేలాచూడాలన్నారు. వీరిసమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడిఉంటానని, వారి సంక్షేమం కోసం అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెలుతానని తెలిపారు.